


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 । కనిష్ఠం 19.0



రిజర్వేషన్ల పైనే అందరిచూపు

- వారంలో కోటా, కేటాయింపులుంటాయనే అంచనా
- 15లోగా ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేసే యోచనలో అధికారులు
- రిజర్వేషన్ల కోటా ఖరారయితే ప్రక్రియ మొదలయినట్లే

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం ఓ వైపు చకచకా ఏర్పాట్లు చేస్తుంటే మరోవైపు ఆశావహులు రిజర్వేషన్ల ఖరారు కోసం ఎదురుచూస్తున్నారు. వార్డు మొదలు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరీకి కేటాయిస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండకూడదు. దీంతో తాజా కులగణన నివేదిక ప్రకారం బీసీలకు 42శాతం సీట్లిస్తామని, జనరల్ స్థానాల్లో ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతుండడంతో క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో బీసీలు పెద్దసంఖ్యలో విజయం సాధించగా, తాజా పరిస్థితుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కన్పిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

పంచాయతీరాజ్ స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత మండలాలు కలిపి మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 పంచాయతీలు, సుమారు 17,500కు పైగా వార్డులు, 722 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నియామకానికి సన్నాహాలు పూర్తయ్యాయి. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ గుర్తులను సిద్ధం చేశారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. అదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈనెల 15లోగా అన్ని రకాల శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు పూర్తిచేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఈనెల 15తర్వాత ఏ క్షణంలోనైనా ప్రభుత్వం ఆదేశిస్తే షెడ్యూల్ విడుదలవుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈలోగానే రిజర్వేషన్లు కోటా, కేటాయింపులు...

- మిగతా 7వ పేజీలో...

యువతకు రక్తపోటు

- మధ్యవయస్కులను పీడిస్తున్న మధుమేహం
- అసాధారణ స్థాయిలో పెరుగుతున్న రోగాలు
- పల్లెల్లోనూ విస్తరిస్తున్న ఎన్‌సీడీ జబ్బులు

ఆధునిక జీవనశైలి, తగ్గిన శారీరక శ్రమ, జన్యుపరమైన కారణాలతో రక్తపోటు(బీపీ), మధుమేహం (షుగర్) వంటి అసంక్రమిత (ఎన్‌సీడీ) జబ్బులు చుట్టుముట్టుతున్నాయి. ప్రధానంగా 35-40 ఏళ్లకే ఈ రెండింటి లక్షణాలు బయటపడుతున్నాయి. బీపీ, షుగర్ తీవ్రత పెరిగేకొద్దీ శరీరంలోని కీలక అవయవాలైన కిడ్నీ, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరు పతనావస్థకు చేరుతోంది. సైలెంట్ కిల్లర్‌గా చెప్పుకునే క్యాన్సర్‌ను తలపించేలా ఎన్‌సీడీ రోగాలు మనిషి ఆయువును హరించేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ అర్బన్)

ఉమ్మడి జిల్లాలో దశాబ్ద కాలంగా బీపీ, షుగర్ తీవ్రస్థాయిలో విస్తరిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా మూడు పదులు నిండిన యువతలోనూ వీటి లక్షణాలు కనిపిస్తున్న తీరును పరిగణిస్తే ప్రజారోగ్యం భవిష్యత్తు అఘాతంలో పడబోతుందన్న ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గత ఏడాది చేపట్టిన ఇంటింటి స్ర్కీనింగ్‌పరీక్షల్లో పల్లెల్లోనూ అసంక్రమిత జబ్బులు (ఎన్‌సీడీ) పెరుగుతున్నట్టు తేల్చింది. విలాస, సుఖవంతమైన జీవనంతో పట్టణవాసులు కొనితెచ్చుకున్న బీపీ, షుగర్ పల్లెలకు విస్తరించడానికి లోపిస్తున్న ఆహార సమతుల్యత, మారుతున్న జీవనశైలి ప్రధానకారణమని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.




బీపీ పెరుగుతోంది..

యువతలో బ్లడ్‌ప్రెషర్ పెరుగుతోందని, పదేళ్ల కాలంలో బీపీ బారినపడివారి సంఖ్యలో యువత అధికంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. నేటితరం యువత సంప్రదాయ ఇంటి వంటల కంటే రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో లభించే ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ తయారయ్యే ఆహారంలో రుచికోసం మెటానియల్ ఎల్లో, టార్‌ట్రాజన్ అనే రసాయనాలతోపాటు టేస్టింగ్‌సాల్ట్ (చైనా ఉప్పు) తప్పనిసరిగా వాడుతుంటారు. వీటి వినియోగంతో బిర్యానీతోపాటు ఫాస్ట్‌ఫుడ్ ఆహారపదార్థాల్లో మంచి రుచి, రంగు వస్తోంది. ఇలా తయారైన ఆహారాన్ని తరచూ తింటే శరీర బరువు అధికం కావడం, బీపీ పెరిగి జీర్ణ సంబంధిత వ్యాధులు ప్రబలి క్రమంగా శరీరంలో షుగర్ లెవల్స్ పెరుగుతున్నాయి. దీంతోపాటు సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసలైన యువతలో బీపీ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గంటల తరబడి ఒకేచోట కదలకుండా కూర్చొని గేమ్స్‌తో కాలక్షేపం చేస్తూ బీపీ, షుగర్‌వంటి రోగాలకు చేరువవుతున్నారు.

అత్యధికంగా రక్తపోటు బాధితులు

ఆరోగ్య పరిరక్షణకు కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో రక్తపోటు బాధితులు అధికమవుతున్నారు. శాఖాహారం కంటే మాంసాహారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం, నిద్రలేమి, పని ఒత్తిడి, మానసిక ప్రశాంతత లేకపోవడం వెరసి బీపీ పెరుగుతోంది. ప్రధానంగా యువత వ్యసనాలకు అలవాటైన క్రమంలో



వారిలో రక్తపోటు లక్షణాలు కనిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కుటుంబసభ్యులు, స్నేహితులపై సహనం కోల్పోయి ఏకాగ్రతను కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీపీతో బాధపడుతున్నవారి సంఖ్య 2,49,651మంది ఉండగా, వారిలో 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు 1,04,853 మంది (42శాతం) ఉన్నారు. మధుమేహం (షుగర్) బాధితులు 1,42,386 మంది ఉంటే వారిలో 12,815 మంది (9శాతం) యువకులు ఉన్నారు. మిగిలిన 1,29,572 మంది 45 ఏళ్లకు పైబడినవారు, మధ్యవయస్కులు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,86,695 మంది బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడతున్నవారు ఉన్నారు. బీపీ, షుగర్‌వ్యాధుల బారినపడుతున్న వారిలో యువత సంఖ్య ప్రమాదకరస్థాయిలో పెరుగుతుండగా, పట్టణాల్లో నివసించే యువతలో ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రక్తపోటు, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్న...

- మిగతా 7వ పేజీలో...

● వైభవంగా దోపోత్సవం



చెర్వుగట్టు ఆలయ వార్షిక బహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దోపోత్సవం, పూర్ణాహుతిని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

●6లో..

క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత వృద్ధి

ఎమ్మెల్సీ కోదండరాం



ఎంజీయూలో సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత వృద్ధి జరుగుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. శనివారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆర్థికాభివృద్ధికి ప్రజల ఆర్తి నుంచి కార్యాచరణ తప్పనిసరి అని, యాంత్రీకరణ ప్రణాళికలతో ఉపయోగం ఉండదన్నారు. ప్రాంతీయ అభివృద్ధి రాజకీయ సమీకరణాల ద్వారానే వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ ఫలాలు అణగారిన జాతులకు సమాన పంపిణీ జరగాలన్నారు. సమ్మిళిత వృద్ధి ద్వారా సామాజిక తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగాలని, అందుకు క్రియాశీలక పౌర సమాజం ద్వారనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ పూర్వ ఉపకులపతి జంధ్యాల బాల గంగాధర్ తిలక్, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, వోఎస్డీ కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ అరుణప్రియ, సెస్ డైరెక్టర్ రేవతి, చిట్టేడు కృష్ణారెడ్డి, కేవీ.శశిధర్, పందరయ్య, సైదులు, పాల్గొన్నారు.

‘చేనేత’కు చేయందేనా..?

- గత పాలకుల నిర్లక్ష్యంతో జీవితాలు దుర్భరం
- చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ మూడు సంక్షేమ పథకాలు
- పకడ్బందీగా అమలు చేయాలని చేనేత సంఘాల విజ్ఞప్తి





దేశానికి అన్నం పెట్టే రైతన్న ఎంత ముఖ్యమో, వస్త్రాన్ని అందించే నేతన్న కూడా అంతే ముఖ్యం. మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు దుర్భరంగా మారింది. సనాతన సంప్రదాయాలు కనుమరుగవుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోకున్నా.. వారసత్వ వృత్తిని, కళను కాపాడుకునేందుకు చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. చేనేత కార్మికులకు సంక్రాంతి కానుకగా తెలంగాణ చేనేత అభయ హస్తం పేరుతో మూడు పథకాలను ప్రారంభించింది. ఈ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన చేనేత కార్మికులకు అందించడంలో అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో మెలగాలి. అప్పుడే చేనేత కార్మికులకు లబ్ధి అందుతుంది.

●7లో..

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జూలకంటి రంగారెడ్డి



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు క్షేత్రస్థాయిలో సిద్ధపడాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు చట్టబద్ధత కల్పించేందుకు బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించి ఎస్సీవర్గీకరణ అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రాలపై వివక్షను పదర్శిస్తున్న కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న ఇందిరా పార్కువద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛలో ఇందిరాపార్కు కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లాకమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రిజర్వాయర్ పనులు

మర్రిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్ పనులు శనివారం కూడా నిలిచిపోయాయి. నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు అర్హులైన వారికి పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, మూడు రోజులుగా కట్ట నిర్మాణ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారు. మూడు రోజుల నుంచి పనులు అడ్డుకున్న చోటికి ఏ అధికారి రాకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం కల్పించలేదంటూ శుక్రవారం బాధితుడు మాదగోని యాదయ్య పెట్రోల్ మీద పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. అయినా అధికారులు స్పందించడం లేదంటూ బాధితులు మూడో రోజు పనులు అడ్డుకున్నారు. న్యాయం జరిగేంత వరకూ పనులు అడ్డుకుంటామని యాదయ్య, మనోహర, నర్సమ్మ, రాములు, హరికృష్ణ హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు న్యాయం

- దేశంలోనే మొదటగా వర్గీకరణకు కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు
- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు విద్యా ఉద్యోగ అవకాశాలల్లో న్యాయం జరుగుతుందని, 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఎట్టకేలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరిగిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను నిలబెట్టుకున్నారన్నారు. వర్గీకరణపై నలుగురు మంత్రులతో కమిటీ, హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్‌తో ఏకసభ్య కమిషన్ వేశారన్నారు. కమిషన్ రిపోర్టు ఇచ్చిన వెంటనే ఈ నెల 4న ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి మాదిగలకు న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణలో మొట్టమొదట ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దామోదర రాజనర్సింహకు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే వర్గీకరణ సాధ్యపడిందన్నారు. న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మొదటినుంచి అండగా ఉండి అమలయ్యే వరకు కృషి చేసిందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలు రుణపడి ఉంటారన్నారు. ఎస్సీల్లో ఏ వర్గానికి అన్యాయం జరగకుండా వారి జనాభా ప్రకారం వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. వర్గీకరణ సాధనకోసం మాదిగలు గత 30 ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేశారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటాలు చేశారన్నారు. వర్గీకరణలో దేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసే విషయంలో కాంగ్రెస్ ముందు వరుసలో ఉన్నట్లు మాదిగలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి జానయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, నాయకులు తోలకొప్పుల గిరి, నకిరేకంటి సైదులు, కొండ భాస్కర్, కొండేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● కన్నుల పండువగా ధ్వజారోహణం



పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజ పటంతో తిరువీధి సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

●6లో..

చెర్వుగట్టుపై వైభవంగా దోపోత్సవం


ఆలయ పరిసరాల్లో అశ్వవాహన సేవలో ఉత్సవమూర్తులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించారు. అశ్వవాహనంపై పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠింపజేసి ఆలయ వీధుల గుండా కల్యాణమంటపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పురాణసాంప్రదాయాలను ఆచరిస్తూ దోపోత్సవాన్ని నిర్వహించారు. దోపోత్సవ వృత్తాంతాన్ని ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ భక్తులకు వివరించారు. అనంతరం ఉదయం అష్టోత్తర శత కలశాలతో స్వామివారికి అర్చకులు శ్రీకాంత్‌శర్మ, సతీశ్‌శర్మ, సురేశ్‌శర్మ, నాగఫణిశర్మలతో అభిషేకం సూర్యనమస్కారాలు, దీక్షా హోమాలు, బలిహరణ అనంతరం ఈవో నవీన్‌కుమార్ చేతుల మీదుగా మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ధ్వజాన్ని అవరోహణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య త్రిశూలస్నానం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ కైంకర్యాల్లోని పూజా క్రతువుల్లో పాల్గొన్న యాజ్ఞికులు, అర్చకులకు దేవస్థానం ఆధ్వర్యంలో పండిత సన్మానం జరిగింది. రాత్రి పుష్పోత్సవం, ఏకాంత సేవలను నిర్వహించారు. వేడుకలో ఈవో నవీన్‌కుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, లింగయ్య, రాజయ్య, వెంకటయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● రామాలయంలో అధ్యయనోత్సవాలు ప్రారంభం


రామాలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ రామాలయంలో అధ్యయనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, వెంకటనర్సింహాచార్యులు, ప్రసాద్, మురళి, జగన్నాధచార్యులు, దామోదరచార్యులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా అధ్యయనోత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. అనంతరం 11వ తేదీ నుంచి 16 వరకు ఫణిగిరి గట్టుపై కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 12వ తేదీన రాత్రి(తెల్లవారు జామున 2 గంటలకు) 108 దివిటీలతో ఎదుర్కోళ్లు, సీతారామస్వామి కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు.

● కర్విరాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో


కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ ఘట్టం, హాజరైన భక్తులు

తుంగతుర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని కర్విరాల గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నూతన దేవాలయం ప్రారంభ అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాతగుట్టలో కన్నుల పండువగా ధ్వజారోహణం


పాతగుట్ట ఆలయంలో ధ్వజారోహణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట దేవస్థాన అనుబంధ ఆలయం పాతగుట్ట లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణంతో ఉత్సవ సంరంభం ఆరంభమైంది. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను భువి నుంచి దివికి ఆహ్వానించేందుకు మహావిష్ణువు వాహనం గరుత్మంతుడిని ఆహ్వానిస్తూ ధ్వజారోహణ పర్వాలను నిర్వహించారు. శ్వేతవస్త్రంపై గరుత్మంతుడిని వేదమంత్రాలతో ఆవాహన జరిపి గరుడముద్దలను ఎగురవేశారు. అనంతరం ఆ ముద్దలను భక్తులకు వితరణచేశారు. అంతకుముందు యాగశాలలో హోమ పూజలు కొనసాగాయి. స్వామిని అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. ఆలయయజ్ఞమండపంలో అధిష్ఠింపచేసి మూల మంత్ర జపం, మూర్తికుంభ, మహామూర్తి కుంభ, ఉపమూర్తి కుంభ స్థాపన చేశారు.

భేరీపూజ, దేవతాహ్వానం

నిత్యారాధనల అనంతరం సాయంత్రం భేరీ పూజతో దేవతాహ్వానం జరిగింది. సప్తస్వరాలు, ఇష్ట వాయిద్యాలతో దిక్పాలకులను ఆహ్వానించడానికి శబ్ద బ్రహ్మం, మూలమంత్ర జపంతో ప్రధాన వాయిద్యం 'భేరీ'ని మ్రోగించి కంకణధారణ చేయడం ఈ ఉత్సవ ప్రత్యేకత. ఈ పూజా పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లంథిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకులు భట్టర్ సురేంద్రాచార్యులు, పాతగుట్ట ముఖ్య అర్చకులు కొడకండ్ల మాధవాచార్యులు, అర్చకబృందం, రుత్వికులు నిర్వహించగా వేడుకల్లో ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి అలంకార సేవోత్సవాలు

పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి అలంకార సేవలు నిర్వహించనున్నారు. స్వామి వివిధ వాహనసేవల్లో ఉదయం, సాయంత్రం వేళలో దశావతారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆదివారం సింహవాహన, అశ్వవాహన సేవల్లో స్వామిని ఊరేగింపు నిర్వహించనున్నారు.

శాస్త్రోక్తంగా లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులకు సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. అదేవిధంగా నిత్యపూజలు కొనసాగాయి. పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు.అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.39,96,694 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మరువలేని అనుభూతి కలిగింది

● ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్


ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్ దంపతులకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం మరువలేని గొప్ప అనుభూతి కలిగిందని హైకోర్టు ప్రధానన్యాయమూర్తి సుజోయ్‌పాల్ అన్నారు. స్వామిఅమ్మవారలను శనివారం ఆయన కుటుంబసమేతంగా దర్శించుకొని, మాట్లాడారు. స్వామివారిని దర్శించుకోవడం తాను అదృష్టంగా భావిస్తున్నానని, ఆధ్యాత్మిక భావన మరింత పెంపొందిందన్నారు. అద్భుతమైన నిర్మాణ ప్రాకారాలు, ఆలయ నిర్వాహణ తీరు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. అంతకు ముందు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలకగా ధ్వజస్థంభానికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. జయరాజు, అదనపు న్యాయమూర్తి సంపూర్ణ ఆనంద్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు 175 మంది గైర్హాజరు


కోదాడలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

కోదాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 175 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. 9, 11 తరగతుల్లో మిగిలిన సీట్ల ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం ప్రవేశపరీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, సీసీరెడ్డి పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉదయం 11 గంటలకు ప్రవేశపరీక్ష ఉండగా విద్యార్థులు 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 181, బాలికల ఉన్నత పాఠశాలలో 240 మందికి 182 మంది, సీసీరెడ్డిలో 274 మందికి 216 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 754 మందికి 175 మంది గైర్హాజరయ్యారు.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య


సందీప్(ఫైల్)

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఒంటరి తనం భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ హిల్‌కాలనీకి చెందిన బండ్ల సందీప్(30) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా ఇంట్లోనే ఉంటున్నాడు. చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన సందీప్ ఒంటరి తనం భరించలేక మనస్తాపంతో శనివారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఉదయం ఎంతకూ ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో బంధువులు తలుపు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారని ఎస్‌ఐ తెలిపారు. సందీప్ బావ నరహరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్థులు

తిప్పర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పజ్జూరులో గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. సుమారు 12, 13 శతాబ్దాల నాటి నాగ శిలా విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు తవ్వి వెలికితీశారు. మూడు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శిల్ప కళా సంస్కృతి పజ్జూరు గ్రామ శివార్లలోని పలు ప్రాంతాలలోని వ్యవసాయ భూముల్లో బయటపడుతున్నాయి. ఈ క్రమంలో విగ్రహాలను గుర్తించిన కొందరు దుండగులు శుక్రవారం రాత్రి గడ్డపారలతో పెకిలించి నాగశిలా విగ్రహన్ని తవ్వి అక్కడ ఏం లేకపోవడంతో వెనుతిరిగినట్లు సమాచారం. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు మాజీ సర్పంచ్ మోయిజ్‌కు సమాచారం అందించారు. ఆయన పురావస్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు రాగి మురళి గుప్తనిధుల అపోహలతో పురాతన విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. గుప్తనిధులు ఉంటాయనేది భ్రమ మాత్రమేనన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు, దూడ మృతి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాకేంద్ర పరిధిలోని మర్రిగూడలో విద్యుదాఘాతంతో ఆవు, దూడ మృతి చెందింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అనుముల మండలం యాచారం గ్రామానికి చెందిన రైతు చింతల నాగరాజు నల్లగొండ పట్టణంలోని కొంత వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రోజు మాదిరే వ్యవసాయ భూమి దగ్గర ఆవులను మేతకు విడిచాడు. ఆవు, దూడ మేత మేస్తుండగా వ్యవసాయ బోరు విద్యుత్ తీగలు తెగి వీటిపై పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఆరు నెలల కిందటే రూ.1.20 లక్షల అప్పు చేసి కొనుగోలు చేశానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా రైతుకు విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

కలకోవ ఘర్షణలో నలుగురి రిమాండ్

మునగాల రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలం కలకోవ గ్రామంలో ఈ నెల 4న రాత్రి రెండువర్గాలు ఘర్షణపడ్డాయి. ఈ ఘటనలోని నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం కలకోవ గ్రామానికి చెందిన కాసాని వెంకన్న, కాసాని ముత్తయ్య, కాసాని బలరాంలను పనస విజయ్‌కుమార్, మునగలేటి చంద్రశేఖర్, చిర్రా ప్రదీప్, దొడ్డారపు వెంకటేష్‌లు చంపాలని భావించారు. ఇందుకోసం గ్రామ పాఠశాల వద్ద కాపు కాసి వెంకటాద్రి ఇంటి నుంచి బయటకి వస్తుండగా ముగ్గురు అన్నదమ్ములపై కర్రలతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కాసాని బలరాం భార్య రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులకు కోర్టు శనివారం రిమాండ్ విధించగా హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించామన్నారు.

కేసుల ఆటకట్టించడంలో 'రాజు'

● లోతైన దర్యాప్తుతో పెండింగ్ కేసులకు చెల్లు
● ఛాలెంజింగ్ కేసుల్లో అందెవేసిన పోలీస్



ఎవరైనా ఎస్‌ఐగా మొదటి పోస్టింగ్‌లో ఆచితూచీ అడుగు వేస్తుంటారు. పాత కేసుల జోలికి వెళ్లేంత సాహసం చేయరు. అందులోనూ ఐదేళ్ల కిందట కేసు అయితే ఇక అంతేసంగతులు. కానీ రాజశేఖర్ రాజు తీరు వేరు. ఏదైనా సరే తన దృష్టికి వస్తే తేల్చేదాకా వదలరు. తన మొదటి పోస్టింగ్‌లోనే ఐదేళ్ల కిందట కేసు ఛేదించి మన్ననలు పొందారు. ఉన్నతాధికారులు ఏం కావాలి అంటే ఇంటికెళ్లక చాలారోజులైంది సెలవు కావాలి సార్ అన్నాడట. అదీ ఆయన విధుల్లో నిబద్ధతను వెలుగుచూపించిన కేసు. నక్సలైట్ ప్రాంతాల్లో పనిచేస్తున్నా, రేషన్, అక్రమాలు, మోసాలకు సంబంధించి కేసు లోతుల్లోకి వెళ్లి అసలు వ్యక్తులను పట్టుకుంటారు. స్వతాహాగా క్రీడాకారుడైన రాజశేఖర్‌రాజు(రాజు) ప్రస్తుతం మిర్యాలగూడ డీఎస్పీగా అక్రమార్కుల ఆటకట్టిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)

రాజశేఖర్‌రాజు ఎస్‌ఐగా జీవితం 1998లో ఆదిలాబాద్ జిల్లా వాంకిడితో మొదలైంది. నక్సలైట్స్ ప్రభావం తీవ్రంగా ఉన్న రోజులవి. గ్రామీణ ప్రాంతాల్లోని కేసుల జోలికి వెళ్లేందుకు పోలీసులు సాహసించని పరిస్థితులు. అయినప్పటికీ తన తొలిపోస్టింగ్‌ను ఛాలెంజ్‌గ్ తీసుకున్నారు. విధుల్లో చేరిన కొత్తలోనే ఓ అదృశ్యం కేసు ఆయన దృష్టికి వచ్చింది. 1993లో బెండాల్ గ్రామంలో అదృశ్యమైన శ్యామ్‌రావు కోసం కుటుంబ సభ్యులు రాజశేఖర్‌రాజును ఆశ్రయించారు. శ్యామ్‌రావు జాడ చెప్పాలని ప్రాధేయపడ్డారు. కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న రాజశేఖర్‌రాజు ఐదేళ్ల కిందట శ్యామ్‌రావుతో కలిసి తిరిగిన వారి నుంచి విచారణ ప్రారంభించారు. చాకచక్యంగా కొద్దిరోజుల్లోనే నిజాలు రాబట్టారు. శ్యామ్‌రావు అక్రమ మద్యం సరఫరా చేసే ముఠాలో సభ్యుడని తెలుసుకున్నారు. మద్యనిషేధం కొనసాగుతున్న కాలంలో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అక్రమ మద్యం రవాణా చేసే ముఠాతో కలిసి పనిచేస్తున్నట్లు గమనించాడు. ఆయన సహచరులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. మద్యం తెస్తూ రాత్రి వేళ ఓ రైతు అడవిపందుల కోసం వేసిన ఫెన్సింగ్‌కు ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు తగిలి శ్యామ్‌రావు మృతి చెందాడు. తమ అక్రమదందా బయటపడుతుందని ముఠా సభ్యులే శ్యామ్‌రావును ఎవరికీ తెలియకుండా అక్కడే గుంతతీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. రాజశేఖర్‌రాజు దర్యాప్తులో ఈ విషయం తెలియడంతో సంఘటనా స్థలంలో తవ్వి ఎముకలు, పుర్రెను పరీక్ష ల్యాబ్‌కు పంపి చనిపోయింది శ్యామ్‌రావుగా నిర్ధారించారు. ముఠా సభ్యులను రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో ముఠా సభ్యుల నుంచి ఇతర వర్గాల నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా రాజశేఖర్‌రాజు చెదరలేదు. శ్యామ్‌రావు అదృశ్యం కేసును ఛేదించడంతో ఉన్నతాధికారులు ఆనందించి ఏంకావాలని కోరారు. చాలా రోజుల నుంచి కుటుంబ సభ్యులను కలవలేకపోయా, తనకు సెలవు కావాలని అడిగి 8రోజుల పాటు సెలవు తీసుకున్నారు.


డీజీపీ మహేందర్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజశేఖర్‌రాజు(ఫైల్)

ఇంద్రవల్లి గోండులతో కలిసి

1981లో ఇంద్రవల్లిలో జరిగిన ఎదురుకాల్పుల్లో గోండులు మరణించడంపై ఆదివాసి ప్రజలు పోలీసులపై కోపం పెంచుకున్నారు. అటవీ ప్రాంతంలో పోలీసులు నిర్వహించే సమావేశాలను బహిష్కరిస్తూ వచ్చారు. 2000-2004 వరకు అక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రాజశేఖర్‌రాజు క్రమంగా గోండులతో స్నేహ సంబంధాలు పెంపొందించారు. జరిగిన తప్పేంటో, బాధ్యులెవరో వివరిస్తూ పోలీసు దర్బార్‌లకు గోండులు హాజరయ్యేలా చేశారు. సీఐగా ఏజెన్సీ ప్రాంతాలైన గూడూరు, మెట్‌పల్లి, కోరుట్ల ఎక్కువగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు.

● బాలిక 7 నెలల గర్భవిచ్ఛిత్తి చేసి పిండాన్ని చెట్ల పొదల్లో విసిరేసిన ఘటనలో బాధిత బాలికను వెతికిపట్టారు. ఆమెను మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేసి డీఎన్‌ఏ పరీక్ష ద్వారా నిందితుడిని కటకటాల వెనక్కునెట్టారు.

కింగ్‌పిన్‌పై పీడీయాక్ట్

2024 ఫిబ్రవరిలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిఎస్పీగా రాజశేఖర్‌రాజు బాధ్యతలు తీసుకున్నారు. గంజాయి, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. నిఘావేసి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్న వారిని, పాలీస్ మిల్లులు ఏర్పాటుచేసి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్న కింగ్‌పిన్‌లను పట్టుకున్నారు. ఏకంగా పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. గంజాయి రవాణాపై నిఘాపెట్టి 35 మందిని అరెస్ట్ చేసి సుమారు 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఇదిలా ఉండగా యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో రూ.కోట్లలో చోరీపై విమర్శలు ఎదుర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్ అధికారులు సామాగ్రిని పెద్దఎత్తున తెచ్చి ప్లాంట్ బయట డంప్‌చేశారు. దానికి రక్షణలేదు. అవి ఎప్పుడు చోరీకీ గురయ్యాయో కూడా తెలియని పరిస్థితి. నాలుగేళ్ల కింద నుంచి ప్లాంట్ బయటనే సామాగ్రి ఉండటంతో ఎంత సొత్తు పోయిందో లెక్కతేలలేదు. పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు రూ.72 లక్షల సామాగ్రి, 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.కోటి వరకు ఉంటుంది.

జాతీయ స్థాయి క్రీడాకారుడిగా

రాఘవరాజు, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు ఆడ, ముగ్గురు మగ సంతానం. అందరిలో చిన్నవాడు రాజశేఖర్‌రాజు(రాజు). ఖమ్మంలో తండ్రి ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. డిగ్రీ వరకు ఖమ్మంలో విద్యాభ్యాసం పూర్తిచేసిన రాజు పీజీ కొరకు హైదరాబాద్‌కు వెళ్లారు. స్పోర్ట్స్‌లలో ప్రతిభ కనబరిచే ఆయన బాస్కెట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించి జాతీయస్థాయిలో సిల్వర్‌మెడల్ సాధించారు. తండ్రికి పోలీస్ ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోయినా ఇష్టంతో ఉద్యోగంలో చేరారు.

ప్రజల భాగస్వామ్యం కావాలి

మిర్యాలగూడలో వర్తకం ఒక్కసాగర్ రోడ్డులోనే జరుగుతుంది. దీంతో రోడ్డుపై రద్దీ ఏర్పడుతోంది. రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో చోరీలు చేసి దొంగలు వెళ్లిపోతున్నారు. ఈ రెండు సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరం. జాబ్‌ల పేరుతో డబ్బుల వసూలు, సైబర్ క్రైంపై అప్రమత్తత అవసరం. పోలీసుల సూచనలు పాటిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

రాజశేఖర్‌రాజు, డీఎస్పీ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


ఎల్లారెడ్డి(ఫైల్)

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఓ రైతు ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించాడు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం మన్నెవారిపంపుకు చెందిన రైతు గుండ్ల ఎల్లారెడ్డి (68) పనుల నిమిత్తం శనివారం ద్విచక్ర వాహనంపై భువనగిరికి వచ్చాడు. పెట్రోల్ పోసుకొని రోడ్డు దాటుతున్న క్రమంలో భువనగిరి నుంచి యాదగిరిగుట్ట వైపు వెళ్తున్న ఉప్పల్ డిపో బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని భువనగిరి జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్లారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

కళ్లదానంతో ఇద్దరికి చూపు

ఎల్లారెడ్డి కుమారుడు నర్సిరెడ్డి, కోడలు మంజుల, మనుమడ్లు, మనుమరాళ్ల వినతిమేరకు ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఎల్లారెడ్డి మృతదేహం నుంచి నేత్రాలను సేకరించారు. దీంతో మృత్యువులోనూ ఇద్దరికి కంటి చూపు ప్రసాదించిన మల్లారెడ్డిని, సామాజిక స్పృహ చూపిన అతడి కుటుంబాన్ని పలువురు అభినందించారు.

కారుబోల్తా పడి ఇద్దరికి గాయాలు

వలిగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ప్రమాదవశాత్తు శనివారం కారు బోల్తాపడి పడింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు షేక్ ఖరీం, కందుల శ్రీను, మిధులారెడ్డి, మధుసూదన్, మాధవులు సొంత పనినిమిత్తం మోత్కూరుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వలిగొండ మండలం నర్సయ్య గూడెం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మధుసూదన్, మాధవ్‌కు గాయాలయ్యాయి. 108 వాహనంలో సిబ్బంది భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కేతేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లిలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వీరబోయిన అయిలమ్మ హైవే దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు అయిలమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో అయిలమ్మను సూర్యాపేట జిల్లా కేంద్ర ఆసుపత్రికి, అక్కడ నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్థానికులు నిలిపారు.

పంట పొలాల్లో ట్రావెల్స్ బస్సు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు



వేములపల్లి శివారులో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ట్రావెల్ బస్సు

వేములపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిద్ర మత్తులో జారుకోవడంతో ప్రైవేట్ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి గ్రామ శివారులో శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. వేములపల్లి ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపిన వివ రాల ప్రకారం.. చందు ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం రాత్రి 9.30గంటలకు చీరాల నుంచి హైదరాబాద్‌కు 45 మంది ప్రయాణికులతో బయల్దేరింది. ఈ క్రమంలో శనివారం తెల్లవారు జామున 2.30గంటల సమయంలో వేములపల్లి మండల కేంద్రం శివారులోని గంగమ్మగుట్ట సమీ పంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులతోపాటు డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను వేరే బస్సుల్లో వారి గమ్య స్థానాలకు చేర్చారు.

‘చేనేత’కు చేయందేనా?

కళాత్మకమైన చేనేత వస్త్రాలను మగ్గాలపై నేసే కళాకారులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనే అధిక సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ చేనేత కళాకారులు రూపొందించే పోచంపల్లి చేనేత టైఅండ్‌డై పట్టు చీర, పుట్టపాక తేలియా రుమాల్ జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపును పొందాయి. జిల్లాలో ఇక్కత్ డిజైన్లతో నేసే వివిధ రకాల వస్త్రాలకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. చేనేత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలుచేస్తోంది. మగ్గం నేసే కార్మికులను గుర్తించి జియోట్యాగ్‌చేసి ప్రత్యేకమైన నెంబరును చేనేత, జౌళీ శాఖ ద్వారా కేటాయించారు. చేనేత సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ‘చేనేత అభయహస్తం’ పేరుతో అమలు చేస్తోంది.

-(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 72 చేనేత సహకార సంఘాలు, 13 మరమగ్గాల సహకార సంఘాలున్నాయి. చేనేత సహకార రంగంపై ఆధారపడిన 34,001 మంది పారిశ్రామికులు జీవనం సాగిస్తున్నారు. చేనేత కార్మికులు సహకారేతర రంగంలో మరో 20వేల పైచిలుకు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వస్త్రాలను నేసే చేనేత మగ్గాలను, కళాకారులను గుర్తించి వాటికి జియోట్యాగింగ్ చేశారు. జిల్లాలో 6,771 చేనేత మగ్గాలకు, 2240 మరమగ్గాలకు జియోట్యాగింగ్ చేసి ప్రత్యేక నెంబర్లు కేటాయించారు. సహకార చట్టంకింద ఏర్పాటైన 48 చేనేత సంఘాలున్నాయి. కాగా, ఇప్పటికీ జియోట్యాగింగ్ కాని చేనేత మగ్గం కార్మికులుంటే చేనేత, జౌళీశాఖలో అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చునని, క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ నిర్వహించి ట్యాగింగ్‌కు సిఫార్సు చేస్తామని జిల్లా చేనేత, జౌళీ శాఖ అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ నేతన్న పొదుపు

ఈ పథకం జియోట్యాగ్‌తో అనుసంధానమైన మగ్గాల చేనేత కార్మికులు, అనుబంధ కార్మికుల సంక్షేమానికి రూపొందించారు. ఇది కార్మికుల్లో పొదుపు అలవాటును ప్రోత్సహించడంతోపాటు వారికి ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తుంది. చేనేత కార్మికులు/అనుబంధ కార్మికులు వారి వేతనాల నుంచి నెలవారీగా 8 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తారు. కాంట్రిబ్యూషన్ గరిష్ఠ పరిమితి రూ.1200. ఇందుకు ప్రభుత్వం రెండింతలు అధికంగా అంటే 16శాతం అందిస్తుంది. అయితే రికరింగ్ డిపాజిట్ వ్యవధిని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించారు. ఈ పథకం కింద ఈ జిల్లాలో 11,389 మందికి రూ. 68.59 కోట్ల నిధులు వారి ఖాతాలో జమ చేశారు.

తెలంగాణ నేతన్న భద్రత

తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా) పథకం రాష్ట్రంలోని జియో ట్యాగింగ్ అయిన మొత్తం చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు వర్తిస్తుంది. తెలంగాణ నేతన్న భద్రతలో నమోదైన కార్మికుడు ఏ కారణం చేతనైనా మృతి చెందితే.. రూ.5లక్షలు మొత్తం నామినీకి అందిస్తారు. తెలంగాణ చేనేత కార్మికుల సహకార సంఘం ద్వారా బీమా కవరేజీ అందరికీ వర్తింపజేస్తున్నా రు. ఈ పథకంలో ఇప్పటి వరకు ఉన్న 65 ఏళ్ల గరిష్ఠ వ యో పరిమితిని ఎత్తివేశారు. 59 ఏళ్ల పైబడిన వారందరికీ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 14 నుంచి వయో పరిమితిని తొలగించింది. ఈ పథకంలో ప్రస్తుతం ఈ జిల్లాలో 10,856 మంది నమోదై ఉన్నారు.

తెంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్ ప్రత్యేకత

చేనేతల కోసం తయారు చేసిన తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్లో చాలా ప్రత్యేకత లు ఉన్నాయి. ముఖ్యంగా లేబుల్ ఒకవైపు తెలంగాణ హ్యాం డ్లూమ్ మార్క్‌తోపాటు 9 అంకెల నెంబరు ఉంటుంది. అందులో మొదటి రెండు అంకెలు ఆ జిల్లా / అసిస్టెంట్ డైరెక్టర్ కోడ్‌కు సంకేతాలు కాగా.. తర్వాత రెండు అంకెలు ఆ ఉత్పత్తి ఏడాదిని రివర్స్‌తో సూచిస్తుంటాయి. తర్వాత అయిదు అంకెలు రన్నింగ్ సీరియల్ నెంబరు తెలియజేస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు. లేబుల్ మరోవైపు కార్మికుడు, ఉత్పత్తి వివరాలు ఉంటాయని తెలిపారు.

నేతన్నకు కరువైన చేయూత

మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు ఆధునిక యంత్రాలతో పోటీపడలేక ఛిద్రమైంది. పాలకుల విధానాల వల్ల ఇప్పటికీ చేనేత కార్మికుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సుమారు 50 మంది చేనేత హస్తకళ పురస్కారాలను పొందడం ఇక్కడి చేనేత రంగానికి దక్కిన గౌరవం, ముగ్గురికి పద్మశ్రీ అవార్డులు వచ్చాయి.

చేనేత రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు

చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. టెస్కో కొనుగోలు చేయకపోవడంతో ప్రస్తుతం జిల్లాలో కోట్లాది రూపాయల వస్త్ర నిల్వలు చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయాయి. కొందరు వ్యాపారులు పవర్‌లూమ్‌లపై ప్రింటెడ్ చీరలు తయారు చేసి చేనేత వస్త్రాలకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. మార్కెట్లో అతి తక్కువ ధరకే లభిస్తుండడంతో కొనుగోలు దారులు ఆ చీరలకే మొగ్గు చూపుతున్నారు

తెలంగాణ నేతన్నకు భరోసా (మార్కెట్ అభివృద్ధి)

నేత కార్మికులు వేతన ప్రోత్సాహకం.. ఈ కార్యక్రమం ప్రాథమిక లక్ష్యం జియోట్యాగ్ అయిన మగ్గాల నుంచి నిర్దిష్ట ఉత్పత్తి ప్రమాణాల ఆధారంగా చేనేత కార్మికులకు ఏడాదికి గరిష్ఠంగా రూ. 18వేలు, అనుబంధ కార్మికులు రూ.6వేలు వేతన సహా యం అందించనున్నారు. దీంతో కార్మికులు వేతన మద్దతు లభించడంతోపాటు నాణ్యత పెరుగుతుంది.

తెలంగాణ చేనేత మార్క్ లేబుల్

చేనేత, సిల్క్ మార్క్ మాదిరిగానే ప్రత్యేకమైన లోగో ద్వారా తెలంగాణకు ప్రత్యేకమైన చేనేత మార్క్ లేబుల్ రూపొందించారు. దీని లక్ష్యాలు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో ప్రీమియానికి అనుగుణంగా తెలంగాణ చేనేత ఉత్పత్తులను లేబుల్ బ్రాండింగ్ చేస్తారు. తెలంగాణ చేనేత వస్త్రాల ఘన వారసత్వ, సంప్రదాయ ప్రతిష్ఠను పెంపొందించడం ఈ పథకం లక్ష్యం. ఈపథకాన్ని తెలంగాణ ప్రభుత్వం చేనేత,జౌళీ శాఖ డైరెక్టరేట్ ద్వారా అమలు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేకమైన లోగో ద్వారా ‘తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్’ రూపకల్పన చేసింది.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి



చేనేత రంగంలో సమస్యలు కళ్ల ముందు కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చేనేత సమస్యలు పరిష్కరించాలని ఇటీవల చేనేత మంత్రి, కమిషనర్‌లకు వినతి పత్రాలను అందజేశాం. ప్రజాప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేనేత రంగాన్ని విస్మరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితమైంది. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లుగానే చేనేత రంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నాం. ప్రకటించిన పథకాలు అమలు జరిగేలా చూడాలి.

- కూరపాటి రమేష్, రాష్ట్ర చేనేత నాయకులు

చేనేత కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి



ప్రభుత్వం చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు తెలంగాణ చేనేత అభయ హస్తం పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 11,389 మంది కార్మికులు అర్హులుగా గుర్తించాం. చేనేత అభయ హస్తం కింద తెలంగాణ నేతన్న పొదుపు, తెలంగాణ నేతన్న భరోసా (బీమా), తెలంగాణ నేతన్నకు భరోసా పథకాలను అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా అసలైన చేనేత కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. జియో ట్యాగింగ్ లేని మగ్గం కార్మికులు కొత్తగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

- పద్మ, రాష్ట్ర చేనేత, జౌళీశాఖ రీజినల్



యువతకు రక్తపోటు

(5వపేజీ తరువాయి)



వారి సంఖ్య 94,860 మంది ఉండగా, 11,383 యువత (12శాతం) ఉన్నట్టు సమాచారం.

ఎన్‌సీడీలో ఉమ్మడి జిల్లాకు నాలుగో స్థానం

అసంక్రమిత వ్యాధుల విస్తరణలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇంటింటి స్క్రీనింగ్ పరీక్షలో ఉమ్మడి జిల్లా జనాభాలో 17.74శాతం మంది రక్తపోటు (బీపీ), 9.30శాతం మధుమేహం(షుగర్) వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు నిర్ధారించారు. ఆరోగ్యం క్షీణించేంత వరకు చాలామంది బీపీ, షుగర్ వ్యాధులను పసిగట్టలేకపోతున్నారని, అందులో గ్రామీణప్రాంత ప్రజానీకం ఎక్కువ సంఖ్యలో ఉన్నట్టు తేల్చారు. తొలిదశలో మందుల వాడకంపై నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో వ్యాధుల తీవ్రత పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు రక్తపోటు, మధుమేహం వ్యాధుల తీవ్రత పెరిగి కిడ్నీ, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులకు చేరువవుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, మితిమీరిన మద్యం, ధూమపాన సేవనం అందుకు ప్రధాన కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బీపీ, షుగర్‌కు కారణాలివే..

బీపీ, షుగర్ వ్యాధులు ప్రబలేందుకు జన్యు లోపాలు, కుటుంబ ఆరోగ్య చరిత్ర, అసమతుల్య ఆహారం, శారీరక శ్రమ లోపించడం, స్థూలకాయం, అధిక బరువు, వాతావరణ కాలుష్యం, మానసిక, శారీరక ఒత్తిడి వంటి కారణాలతో స్వయం సహాయక కణజాలంపై దాడి జరిగి మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) వంటి లక్షణాలు బయటపడుతున్నాయి. ఈ అసంక్రమిత వ్యాధులను అరికట్టేందుకు జీవనశైలిని ఆరోగ్యవంతంగా మార్చుకునే ప్రయత్నం చేయాలని వైదులు సూచిస్తున్నారు.

మధుమేహానికి వంటిల్లే ఔషధ గని

సంప్రదాయ వంటకాల తయారీకి ఉపయోగించే కొన్ని సుగంధ ద్రవ్యాలు, పోపుల్లో బీపీ, షుగర్‌ను నియంత్రించే లక్షణాలు ఉన్నాయి. అందుకే మన పూర్వీకులు ఆహారం తయారీలో కొన్ని దినుసులను తప్పనిసరి చేసి సంప్రదాయంగా అందించారు. అందులో మధుమేహాన్ని తగ్గించేందుకు జీలకర్ర, మెంతులు, అల్లం, వెల్లుల్లి, పసుపు, తులసి, కరివేపాకు, పాలకూర, బీన్స్ వంటివి మనం తీసుకునే ఆహారంలో నిల్వ ఉండే చక్కెరస్థాయి తగ్గించడంతోపాటు శరీరంలో షుగర్ లెవల్‌ను స్థిరంగా ఉంచేందుకు ఉపకరిస్తాయని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


రోగులకు కౌన్సిలింగ్ చేస్తున్నాం



బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడేవారు తీసుకోవాల్సిన ఆహా ర పదార్థాలు, పాటించాల్సిన నియమ నిబంధనలపై కౌన్సిలింగ్ చేస్తున్నాం. మండల కేంద్రాల్లోని ప్రతీ పీహెచ్‌సీలో రోగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. రక్త నమూనాలు సేకరించి టీజీ డయాగ్నస్టిక్ హబ్‌కు పంపి వచ్చిన ఫలితాలను పేషంట్లకు అందజేస్తున్నాం. పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించే రక్త పరీక్షల్లో ఎక్కువగా షుగర్ లక్షణాలు బయటపడుతున్నాయి. 35 ఏళ్లపైబడ్డ వారిలో బీపీ లక్షణాలతోపాటు షుగర్ లెవల్స్ సాధారణ స్థాయికి మించి నమోదవుతున్నాయి. రోగనిర్ధారణ జరిగిన తరువాత రోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏఎన్ఎం, ఆశాలతో పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం.

-డాక్టర్ గీతావాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, మిర్యాలగూడ

జీవనశైలిలో మార్పు తెచ్చుకోవాలి



ప్రజలు వారి జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆహారంలో పోషకాల సమతుల్యత దెబ్బతినడం, నిద్రలేమి, పని ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో అసంక్రమిత వ్యాధులబారిన పడుతున్నారు. ప్రధానంగా మద్యపానం, ధూమపానం అలవాట్లను తగ్గించుకొని శారీరక వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజల జీవనశైలి, ఆహార నియమాల్లో మార్పు జరగపోతే ప్రతీ ఐదుగురిలో ఒకరు బీపీ, షుగర్ లక్షణాల బారినపడే ప్రమాదం ఉంది.

డాక్టర్ రవితేజారెడ్డి, మధుమేహ వ్యాధి నిపుణులు, మిర్యాలగూడ

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

పెద్దవూర, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చలకుర్తి క్యాంప్ జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11వ తరగతుల్లో ఖాళీలకు భర్తీకి నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. 9వ తరగతి పరీక్షను చలకుర్తి క్యాంపుతోపాటు నల్లగొండలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలో 1,076 మంది విద్యార్థులకు 866 మంది, 11వ తరగతి పరీక్షను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 11 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించగా 2,602 మంది విద్యార్థులకు 2130 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

‘నేతన్న పొదుపు’ను సద్వినియోగం చేసుకోవాలి

చేనేత కార్మికులు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ నేతన్న పొదుపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి చేనేత సహకార సంఘం డైహౌజ్‌లో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఆధ్వర్యంలో నేతన్న పొదుపు పథకంపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చేనేత కార్మికులతోపాటు వివిధ చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తెలంగాణ నేతన్న పొదుపు పథకం కోసం ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో అనుబంధ కార్మికులు ఇద్దరు ఉంటే ఈసారి ఒక్కరినే ఈ పథకంలో అర్హులుగా పొందుపరిచినట్లు వివరించారు. మగ్గం నేసే కార్మికులు రూ. 1200, అనుబంధ కార్మికుడు రూ.600 చొప్పున పొదుపు పథకంలో జమ చేసుకునేందుకు వీలుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 7500 జియోట్యాగ్ కలిగిన మగ్గాలున్నాయని అన్నారు. జియో ట్యాగ్ కలిగిన మగ్గాలపై కార్మికుడు నిరంతరం పనిచేస్తుంటేనే పొదుపు పథకానికి అర్హుడని తెలిపారు. పథకం ప్రారంభమైన నేపథ్యంలో మొదటి దశలో జిల్లా యంత్రాంగం ఎంక్వైరీ నిర్వహించి మరొకసారి సెంట్రల్ టీం ఎంక్వైరీ చేసిన తర్వాత అర్హులైన కార్మికులకు మాత్రమే ఈ పథకంలోకి ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ పథకంలో అర్హులుగా కావాలంటే నిరంతరం చేనేత పని చేస్తూ ఉండాలని తెలిపారు. కాగా, మార్చి నెల వరకు ఎంక్వైరీని పూర్తి చేసి అనంతరం ఆర్డీ 2 అకౌంట్‌ని ప్రభుత్వం ప్రారంభించి వాటిలో పొదుపును జమ చేస్తుందన్నారు. జియోట్యాగ్ లేని కార్మికులు దరఖాస్తు చేసుకున్న వారికి జియో ట్యాగ్ అందిస్తామని, ట్యాగ్ వచ్చిన తర్వాత వారిని కూడా ఈ పథకంలో భాగస్వాములను చేస్తామని అన్నారు. గతంలో మూడేళ్ల కాలపరిమితి ఉన్న ఈ పథకం కార్మికులు కోరిన విధంగా రెండు సంవత్సరాల కాలపరిమితి మాత్రమే ఉంటుందన్నారు. నిజమైన కార్మికుడికి లబ్ధి చేకూరే విధంగా చేనేత రంగాన్ని పరిరక్షించే విధంగా నియమ నిబంధనలు రూపొందించారని తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో డీవో శ్రీనివాసరావు, ఏడీవో బాల్‌మోహన్‌రెడ్డి, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, చేనేత సంఘాల ప్రతినిధులు భారత లవకుమార్, అంకం పాండు, చింతకింది రమేష్, భారత భూషణ్, కర్నాటి పురుషోత్తం పాల్గొన్నారు.

సిద్ధార్థుడి జీవిత వర్ణన అద్భుతం



బుద్ధవనం గురించి బౌద్ధ భిక్షువులకు వివరిస్తున్న శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్మించిన బుద్ధవనంలో శిల్పాల్లో సిద్ధార్థుడి జీవితం అద్భుతంగా వర్ణించబడిందని దక్షిణాసియా దేశాల బౌద్ధ భిక్షువులు కొనియాడారు. శుక్రవారం బుద్ధవనంలో నిర్వహించిన త్రిపీటక పఠనోత్సవానికి హాజరైన దక్షిణసియా దేశాలకు చెందిన 115 మంది బౌద్ధ భిక్షువులు శని వారం బుద్ధవనాన్ని, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శించి తిల కించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రవేశద్వారం నుంచి ఊరేగింపుగా బయల్దేరి బుద్ధవనాన్ని కలియతిరిగారు. మహాస్థూపంలోని బుద్ధుని విశేషాలను తిలకించారు. మహా స్థూపంపై ఉన్న శిల్పాలను గురించి బౌద్ధ విశ్లేషకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. బుద్ధవనంలో సమావేశ మందిరంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తిల కించారు. శ్రీలంక సహకారంలో ఏర్పాటు చేసిన అవకాన బుద్ధ విగ్రహాన్ని తిల కించిన అనంతరం ఆ దేశం బహూకరించిన ధర్మగంట మోగించి బుద్ధవనం ప ర్యటనను ముగించారు. అనంతరం నాగార్జునకొండకు ప్రత్యేక లాంచీలో చేరుకు న్నారు. కొండపై మ్యూజియం, బౌద్ధమత స్థూపాలను, నమూనాలను ఆసక్తిగా తిలకించారు. ఆచార్య నాగార్జునుడు నడియాడిన నేలపై తాము అడుగుపెట్టడం సంతోషంగా ఉందని బౌద్ధ భిక్షువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగార్జునకొండ మ్యూజియం ఇన్‌చార్జి కమలహాసన్, మహాబోధి బుద్ధ విహార అధ్యక్షుడు కశ్యప బంతే, ఆనంద బంతే, సంఘపాల బంతే, శ్రీలంక, మయన్మార్, కంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు అంతర్జాతీయ త్రిపీటక పఠనోత్సవ వ్యవస్థాపకురాలు వాంగ్మే డిక్సే (అమెరికా), సభ్యులు నెల్సన్, అధికారులు శ్యాం, శాసన, రక్షిత, రవిచంద్ర, శ్రీనివాస్, నర్సింహారావు, పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జుక్షియో నుంచి ఉద్యోగులు ఔట్

● గ్రామీణ యువతకు స్థానికంగానే డాటా ఎంట్రీ ఉద్యోగాలు కల్పించిన కంపెనీ

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాలకే పరిమితమైన డాటా ఎంట్రీ, ఇతర కంప్యూటర్ స్కిల్డ్ ఉద్యోగాలను గ్రామీణ యువతకు చేరువ చేసిన జుక్షియో టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపింది. మేడ్చల్ జిల్లా ఉప్పల్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జుక్షియో టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ యాదాద్రి జిల్లాకేంద్రం భువనగిరిలోని సువాలి ఎస్టేట్‌తో పాటు యాదగిరిగుట్ట, తాజ్‌పూర్ తదితర ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలుగా డేటా సెంటర్లను ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తోంది. యాదాద్రి జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో కూడా మరిన్ని సెంటర్లను కొనసాగిస్తుండగా వాటిలో సుమారు 1200 మంది స్థానిక యువత వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. నైపుణ్యం ఆధారంగా రూ.10వేల నుంచి రూ.30వేలకు పైగా వేతనా లు లభిస్తున్నాయి. ఇటీవల అకస్మాత్తుగా సుమారు 300మందికి పైగా యువతను సంస్థ ఉద్యోగాల నుంచి తొలగించింది. వారిలో అధిక మంది యాదాద్రిభువనగిరి జిల్లావాసులే కావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ఇటీవల జిల్లా కార్మిక శాఖ అధికారికి కూడా వినతిపత్రం అందజేశారు. జుక్షియో టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మాత్రం నిబం ధనల ప్రకారమే ఉద్యోగులను తొలగిస్తున్నామని, ఉద్యోగం తొలగింపు సమా చారం ముందుగానే ఇచ్చామని, బోనస్‌గా ఒక నెల వేతనం ఇవ్వడంతో పాటు ఆరు నెలల వరకు వైద్య బీమా వర్తించేలా భద్రత కల్పించామని సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. తామే ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించి సుమారు 5, 6 సంవత్సరాల పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న సమీకరణలు, టెక్నాలజీకి అనుగుణంగానే అన్‌స్కిల్డ్ ఉద్యోగులను తొలగిస్తున్నామని పేర్కొంటున్నారు. త్వరలో మరోమారు నియామకాలు చేపడుతామని నైపుణ్యం ప్రదర్శించే పాతవారికి ఉద్యోగాలు కల్పించడంలో ప్రాధాన్యం ఇస్తామని అంటుండడం గమనార్హ న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు భట్టుపల్లి అనురాధ అంటున్నారు.

రిజర్వేషన్లపైనే అందరిచూపు

(5వ పేజీ తరువాయి)

కూడా ఖరారవ్వాల్సి ఉంటుంది. ముందుగా పరిషత్‌లకు, వెంటనే వారం రోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. పరిషత్ ఎన్నికలు నిర్వహించాక, ఫలితాలు ప్రకటించకుండా కోడ్ కొనసాగిస్తూ, వారం తేడాతోనే గ్రామపంచాయతీల ఎన్నికలు ముగించాలని, తద్వారా గ్రామాల్లో ఘర్షణలకు, గొడవలకు ఆస్కారం లేకుండా చూడడంతో పాటు, పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించవచ్చనేది ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాల ఆలోచనగా అధికారులు చెబుతున్నారు.

రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు

2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 25, మహిళలకు అన్ని కేటగిరీల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ స్థానాలకు, ఎంపీపీ పదవులకు పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో జిల్లాల వారీగా కోటాను ఖరారు చేస్తే, జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ఆ కోటా ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా సీట్లను కేటాయించారు. ఎంపీటీసీ స్థానాలకు, సర్పంచ్ పదవులకు కలెక్టర్ల స్థాయిలో మండలాల వారీగా కోటా ఖరారు చేసి, ఆర్డీవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో సీట్లను కేటాయించారు. ఈసారి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకున్నా మొత్తం రిజర్వేషన్ల కోటా 50శాతానికి మించకుండా నిబంధనలు రూపొందిస్తారని, ఆ మేరకు కోటా ఖరారు, సీట్ల కేటాయింపు గతంలో మాదిరిగానే చేపడతారా? లేక కోటా ఖరారు, కేటాయింపులపై మార్పులు, చేర్పులు తీసుకుంటారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ వారంలోనే అన్ని అంశాలపై, వారంలోగా రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామాలు, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు వారికి అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్ని రకాలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అర్హత కలిగిన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో త్వరలో కానున్న జేబీఎం ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు అర్హత కలిగిన డ్రైవర్‌లు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సల్ మోబిలిటీ కంపెనీ ఆపరేటర్ మేనేజర్ ఆర్. రాజీవ్ ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల హెవీ లైసెన్స్ బ్యాడ్జీతో పాటు హెవీ వెహికిల్ నడిపిన అనుభవం ఉండాలని పేర్కొన్నారు. 10వ తరగతి చదివి ఉండి, వయస్సు 25 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని పేర్కొన్నారు. అర్హత, అనుభవం కలిగిన డ్రైవర్లు సెల్: 8639001701, 7382835217లలో సంప్రదించాలని సూచించారు.

బీసీలకు 60శాతం రిజర్వేషన్లు కల్పించాలి : శ్రీనివాస్‌గౌడ్

శాలిగౌరారం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 60శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 52శాతం ఉన్న బీసీలకు 45శాతం వరకు తగ్గించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో మళ్లీ కులగణన చేసి బీసీలకు న్యాయబద్ధమైన వాటాను తేల్చిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఇన్‌చార్జి డీఆర్‌వోగా అశోక్‌రెడ్డి


అశోక్ రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఆర్‌వోగా కొనసాగిన అమరేందర్ ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. కాగా తాజాగా ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించిన అశోక్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

‘ట్రస్టు’ లేని ఆలయాలు!

ఆదాయం అసలే రాని, లేని ఆలయాలకు ధర్మకర్తలుగా పనిచేసేందుకు రాజకీయ నేతలు ఇష్టపడటం లేదు. చిన్న ఆలయాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆదాయం లేని ఆలయాలకు ట్రస్టు ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. చిన్న ఆలయాల పాలక మండళ్ల నియామకం కోసం నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 17 ఆలయాలకు నోటిఫికేషన్ జారీ చేసి మూడు నెలలు గడుస్తున్నా, కేవలం 4 ఆలయాలకు మాత్రమే ధర్మకర్తలుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవడం ఇందుకు నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

» 17 ఆలయాలకు నోటిఫికేషన్ జారీ
» 4 ఆలయాలకే వచ్చిన దరఖాస్తులు
» రెండింటికే ట్రస్టుబోర్డు ఏర్పాటు
» పాలక మండళ్లలో పదవులపై కనిపించని స్పందన

చిట్యాల మండలానికి చెందిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (చిట్యాల), బాలలక్ష్మీనరసింహస్వామి ఆలయం, సీతారామచంద్రస్వామి ఆలయాలు(పేరేపల్లి), వేణుగోపాలస్వామి ఆలయం (వట్టిమర్తి), రామలింగేశ్వరస్వామి దేవాలయం (గుండ్రాంపల్లి) ఉన్నాయి. అదేవిధంగా కట్టంగూరు మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయం (ఈదులూరు), లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం (కట్టంగూరు), కేతేపల్లి మండలంలోని శివ మహాదేవ దేవాలయం (కాసనగోడు), వేంకటేశ్వరస్వామి ఆలయం (గుడివాడ), నకిరేకల్ మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయం(మంగళపల్లి), శంభులింగేశ్వరస్వామి దేవాలయం (చందుపట్ల), లింగమంతులస్వామి దేవాలయం (నెల్లిబండ), గోరక్షక స్వామి దేవాలయం (గోరెంకలపల్లి), విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం (నకిరేకల్) ఉన్నాయి. అదేవిధంగా నార్కట్‌పల్లి మండలంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం(శాపల్లి), ఆంజనేయస్వామి దేవాలయం (ఎల్లారెడ్డిగూడెం), వేణుగోపాలస్వామి దేవాలయం (నార్కట్‌పల్లి) ఉన్నాయి.

కేవలం 4 ఆలయాలకే దరఖాస్తులు

నలుగురు ధర్మకర్తలు ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడు కలిపి మొత్తం ఐదుగురితో పాలక మండలిని నియమించనున్నారు. నల్లగొండ జిల్లాలోని 6(సీ) కేటగిరీకి చెందిన 17 ఆలయాలకు గతేడాది అక్టోబరు 9వ తేదీన ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో అన్నీ నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన ఆలయాలే ఉండటం గమనార్హం. నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి 20 రోజుల గడువు ఇచ్చారు. కానీ గడువు ముగిసే నాటికి కేవలం 4 ఆలయాలకే పాలకమండలి కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటిలో చిట్యాల మండలంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, బాలలక్ష్మీ నరసింహస్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ఆంజనేయస్వామి ఆలయానికి మాత్రమే పాలక మండలి నియామక దరఖాస్తులు వచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. వీటిలో చిట్యాలలోని ఒక్క దేవాలయానికి మాత్రమే పాలకవర్గం ఏర్పాటైనట్లు దేవదాయశాఖ కార్యాలయ సెక్షన్ ఉద్యోగి తెలిపాడు. మిగతా మూడు ఆలయాల దరఖాస్తులు ఎండోమెంట్ పర్యవేక్షకురాలి పరిశీలనలోఉన్నట్లు తెలిపారు. చిన్న ఆలయాలకు ఆదాయం లేకపోవడమే ధర్మకర్తలు ముందుకు రాకపోవడానికి కారణమని తెలుస్తుంది.


నార్కట్‌పల్లిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

ఆలయాల అర్చకులకు వేతనం ఇవ్వాలి



భూములతో నిమిత్తం లేకుండా 6(సీ) కేటగిరీ కింద గుర్తించిన ఆలయాలన్నింటికి ప్రభుత్వం ఎండోమెంట్ ద్వారా దూపదీప నైవేద్యం తరహాలో రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాలి. కొన్ని ఆలయాల్లో భూములకు వస్తున్న కౌలు ఆదాయం డీడీఎన్ కింద ఇచ్చే గౌరవ వేతనంలో సగం కూడా లేదు. ప్రభుత్వం ఈ వ్యత్యాసాన్ని గుర్తించి అర్చకునికి వేతనం ఇస్తే ఆలయాల నిర్వహణ, అభివృద్ధికి భక్తులు ముందుకు వస్తారు.

- దోసపాటి ప్రసాద్, భక్తుడు, నార్కట్‌పల్లి

ఒక్క దేవాలయానికే బోర్డు ఏర్పాటైంది



జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని 6(సీ) కేటగిరీ గల 17 ఆలయాలకు ఇంతకుముందు సహాయ కమిషనర్ ఉన్న అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో 13 ఆలయాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కేవలం నాలుగు దేవాలయాలకు మాత్రమే పాలకమండలి సభ్యునిగా కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కేవలం చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయానికి మాత్రమే కమిటీ ఆమోదం పొందింది. మిగతా 3 ఆలయాల దరఖాస్తులు పరిశీలన దశలోనే ఉన్నాయి.

- భాస్కర్, సహాయ కమిషనరు, నల్లగొండ

నిధుల కేటాయింపులో వివక్ష

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతు, వ్యవసాయ, ఉపాధి కూలీలు, దళితులకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో అన్యాయాన్ని జరగడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో పేదోళ్లకు అన్యాయం చేసి పెద్దోళ్లకు మేలు జరిగేలా జరిగిందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చెర్కు పెద్దులు, జాల యాదమ్మ, కుమ్మరి శంకర్, దండు రవి, ఆమనగంటి అయిలయ్య, కల్లూరి కంఠమహేశ్వర్, కట్ట రామచంద్రం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

గట్టుప్పల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన గట్టుప్పల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాములు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 21మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 13మంది పురుషులు, 8 మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు.

ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలి


సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంతో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని విడుదల చేసి, నగదు రహిత వైద్యాన్ని వెంటనే అమలుచేయాలని కోరారు. అనంతరం 30మంది పెన్షనర్లకు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బి.మోహన్‌రావ్, అంజనేయులు, జెల్లా పుల్లయ్య, గోపాల్‌రెడ్డి, రమేష్, ఆజంఅలీ, వెంకటయ్య, బాలరాజు, భిక్షం, శంకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

నల్లగొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు కేఎస్ రెడ్డి, బాసాని వెంకటయ్య, ఎన్ఆర్‌సీ రాజు పిలుపునిచ్చారు. నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సమ్మె సమాయత్తంలో భాగంగా గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జేఏసీ పిలుపుమేరకు సమ్మెలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. యూనియన్లను తక్షణమే పునరుద్ధరించాలని, 2021 వేతన సవరణ వెంటనే చేయడంతో పాటు 2017 వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రాబోయే ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా ఆర్టీసీ నిర్వహించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు సత్తయ్య, కెఎల్‌రెడ్డి, లింగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టం జిల్లా న్యాయసలహాదారుగా గణేష్


గణేష్

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం జిల్లా న్యా య సలహాదారునిగా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన చేకూరి గణేష్ నియమితులయ్యారు. నల్లగొండలో శనివారం నిర్వహించిన సమావేశంలో గణేష్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల ప్రవీణ్‌కుమార్ నియమించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సామాజిక అంశాలపై న్యాయ పోరాటాలు చేసి ఎన్నో అవినీతి అక్రమాలను సహ చట్టం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు మేలు చేసేవిధంగా తన బాధ్యతను నెరవేరుస్తానని అన్నారు. సహచట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తన నియామానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీ క్రీడాకారులకు జెర్సీల బహూకరణ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడాకారులకు మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బింగి మహేష్ జెర్సీలను అందజేశారు. కబడ్డీ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలన క్యాలెండర్ ఆవిష్కరణ

శాలిగౌరారం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి బట్ట సైదులు ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి గద్దపాటి సుధాకర్ మాట్లాడుతూ డీవైఎఫ్‌ఐ గంజాయి డ్రగ్స్ నిర్మూలన కోసం యువతని చైతన్యం చేయడం కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌ను అరికట్టి యువతను చైతన్యం చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు గంట మల్లేష్, నాయకులు చలకాని మల్లయ్య, కుమార్, తేలుకుంట్ల జగన్, జెర్రిపోతుల శ్రీను, నరసింహ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మర్రిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మండల ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఎంపీడీవో మున్నయ్య శనివారం మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని వట్టిపల్లి, కొండూర్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మూడు గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఉన్నటు వంటి పోలింగ్ కేంద్రాలను మూడు రోజులుపరిశీలించడం జరుగుతుందని, ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈయన వెంట కార్యదర్శులు యూసుఫ్, వంశీ, మదు, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

● మూడు ట్రాక్టర్లపై వాల్టా కేసు నమోదు

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా మండల పరిధిలోని కోరటికల్ వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను నల్లగొండ మైనింగ్ అధికారులకు శనివారం పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పంచనామా చేసి వాటిపై వాల్టా కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు

● క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మహాలింగార్చన అభిషేకాలు
● భక్తి పారవశ్యంతో భక్తుల పూజలు


వీటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వీటీ కాలనీలోని శ్రీదేవీ భూదేవి సహిత సపరివార వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ జక్కికృష్ణావధాని ఆచార్యత్వంలో వారి శిష్యులు మూర్తి, భాస్వంతశర్మ, మురళీశర్మ, ఆలయ ప్రధాన అర్చకలు మహంకాళి పవన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు సాయిశర్మ ఆలయంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారికి ని త్యార్చనలు, జపహోమ అనుష్టాన పారాయణాలు నిర్వహించారు. ఆవాహిత స్థాపిత దేవతా పూజలను వేద మంత్రోచ్చారణ మధ్య శా స్త్రోక్తంగా చేపట్టారు. అదేవిధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైన వేంకటేశ్వరస్వామికి పంచసూక్తాలతో, పంచోప నిషత్తులతో అ భిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలక ఆంజనేయస్వామికి నర్మద బాణలింగాలతో విశేషంగా మహాలింగార్చన అభిషేకం చే శారు. యాగశాలలో మహాసౌర, సదర్శననాదిహోమాలు చేశారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ, వడమాల సమర్పణ, సాయంత్రం రా హుకాలంలో సర్పసూక్తయుతంగా రాహుకేతుపూజలు, సుబ్రహ్మణ్యారాధన, పంచాయుతన స్థితచంద్రమౌళీశ్వరస్వామికి దివ్యస్ఫటిక, లింగాలకు విశేషభిషేకాలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని భక్తితో కొలిచారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు మాజీ కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, పారెపల్లి పురుషోత్తం, నూకల జయపాల్‌రెడ్డి, మేడం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ 9వ తేదీన సరస్వతి సమారాధన, గాయత్రీదేవికి అభిషేకాలు, సాయంత్రం గరుడ వాహనసేవ, 10న శ్రీదేవి, భూదేవీ సహిత వేంకటేశ్వర స్వామివారి దివ్వ కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి, అన్నసంతర్పణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వీ.ఎన్. నర్సింహమూర్తి, గిరిజ, గోపాల్, గోపాలకృష్ణమూర్తి, చల్లా లింగారెడ్డి, విజయ్, భారతి, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, అపర్ణ, నాగేశ్వర్‌రావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యువత క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ శివరాంరెడ్డి


కనగల్ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఎస్ఐ విష్ణుమూర్తి

తిప్పర్తి, కనగల్, మర్రిగూడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన యువతేజం అనే కార్యక్రమంలో ఏర్పాటు చేసి మండలంలోని పలు గ్రామాల యువతకు సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ బి. సాయిప్రశాంత్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి డీఎస్పీ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంమూర్తి, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లో మూడు రోజులుగా కొనసాగిన కబడ్డీ పోటీలు ముగిశాయి. ప్రథమ బహుమతి కనగల్, ద్వితీయ బహుమతి చెట్లచెన్నారం, తృతీయ బహుమతి తిమ్మన్నగూడెం జట్లు దక్కించుకున్నాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేత జట్లకు ఎస్ఐ విష్ణుమూర్తి ట్రోఫీతో పాటు, నగదు పురస్కారాలను అందజేశారు. త్వరలో జరిగే డివిజన్‌స్థాయి పోటీలకు గెలిచిన జట్లను పంపుతామని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు నర్సిరెడ్డి, సర్వరాజ్‌ఖాన్, హెచ్‌సీ రషీద్‌ఖాన్, పీఈటీలు నర్సిరెడ్డి, విజయ్, పీసీలు రమేష్‌నాయక్, రమేష్, సురేష్, బుర్హాన్, మోహన్, వెంకటయ్య, షాలిని పాల్గొన్నారు.

● మర్రిగూడలో నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, కృష్ణారెడ్డి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. యువత క్రీడల వల్ల స్నేహభావం పెంపొందించుకొని మానసిక ఉల్లాసానికి, శరీర ధృడత్వానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు క్రీడా సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్తం

తిప్పర్తి: మండల పరిధిలోని గోదోరిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు విద్యార్థులు, ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ, జిల్లా అధికారుల పాత్రలతో అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.నరసింహనాయక్, హెచ్‌ఎంలు యాదగిరి, కల్పన, టీచర్లు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పట్టణంలోని సాగర్ రోడ్డులో గల శ్రీ చైతన్య పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ పాత్రల్లో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సిహెచ్. యాదయ్య, యాస శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం త్రిమూర్తి, కె.నాగేశ్వరావు, ఎం.ఉమారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

నల్లగొండ: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయిని న్యూస్ స్కూల్ పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి అన్నారు. పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంట్ల పద్మ, ప్రిన్సిపాల్ అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, స్పందన, పర్వత్‌రెడ్డి, ఫాతిమా, జగన్‌రెడ్డి, నగేష్, స్వామి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని వెలిమినేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ ఎల్లమ్మ, టీచర్లు విజయలక్ష్మి, శ్రీధర్, వనజ పాల్గొన్నారు.

శాలిగౌరారం: ప్రభుత్వ మోడల్ స్కూళ్ల టీఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గ కమిటీలో మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు చిత్తలూరి సత్యనారాయణ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, టీచర్లు శ్రీనివాస్, కృష్ణయ్య అభినందనలు తెలిపారు.

కట్టంగూరు: కట్టంగూరులోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వార్షిక ఏకాదశి హోమం, పూర్ణాహుతి, ఎదుర్కోళ్లు స్వామివారి ఊరేగింపు, గరుడముద్ద, గోదూళి కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, పెద్ది బాలనర్సింహ, జనార్ధన్, ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఇటీవల పుట్ట వీరయ్య మృతి చెందాడు. అలాగే మండలకేంద్రం కేతేపల్లిలో జటంగి లింగమ్మ, అవ్వారి ఆరోగ్యయ్య మృతి చెందారు. వారి కుటుంబాలను ఆయన కలిసి పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ ఉన్నారు.

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో తిరుపతమ్మ తల్లి దీక్షా స్వాములు ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 40రోజులకు పైగా తిరుపతమ్మ తల్లి దీక్ష నిర్వహించిన స్వాములు పెనుగంచిప్రోలుకు వెళ్లేందుకు ఇరుముడి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు తిరుపతమ్మ తల్లి ఆలయంలో ఇరుముడులు ధరించారు.

నల్లగొండ టౌన్: జగిని టెక్స్‌టైల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలీవ్స్ డెంటల్ వరల్డ్ ప్రథమ వారికోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని సందర్శించారు. కార్యక్రమంలో జగిని వెంకన్న, డాక్టర్ ఆదిత్య జగిని, డాక్టర్ సుచరిత, హేమ, వైష్ణవి, నిఖిల్, అచ్యుత్‌రావు, ఉదయ్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరు కుటుంబాలకు స్థానికుడైన ఆల్డాస్ సతీష్ బియ్యం అందజేశారు. గ్రామానికి చెందిన దూత జోసఫ్, వడ్డె జానయ్య మృతి చెందారు. పేద కుటుంబాలైన వారికి స్థానికుడైన సతీష్ ఒక్కో కుటుంబానికి 50కిలో బియ్యం అందజేశాడు.

కనగల్: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎస్ఐ విష్ణుమూర్తి అన్నారు. కనగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు.

ఉద్యోగులకు తనవంతు సహకారం

● కలెక్టర్ ఇలా త్రిపాఠి


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తన కుటుంబ సభ్యుల లాంటి వారిని ఎల్లప్పుడూ వారికి తనవంతు సహకారం ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో సమావేశ మందిరంలో శనివారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవోస్) జిల్లా శాఖ రూపొందించిన టీఎన్జీవో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరూ ఎప్పటికప్పుడు తమవంతు కృషి చేస్తూ జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి జె. శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహాచారి, కేంద్రసంఘం నాయకుడు వంగూరు విజయకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, రాష్ట్ర ఈసీ సభ్యుడు విజయ్, జిల్లా కోశాధికారి జయరావు, అసోసియేట్ అధ్యక్షుడు డీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి పుష్పకు పలువురి శుభాకాంక్షలు


వేముల పుష్పకు నోటుబుక్స్, అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న రేగట్టె నర్సిరెడ్డి, నాయకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప జన్మదినం సందర్భంగా శనివారం ఆమెకు నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తనను నేరుగా కలిసి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలకు బదులుగా విద్యార్థులకు అవసరమైన నోటు బుక్స్ పెన్నులు, పెన్సిళ్లు అందజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు నోటు బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, సట్టు సత్తయ్య, సిగ విష్ణు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, సాగర్ల సైదులు, వేముల నర్సింహ్మా, రాధారపు బిక్షపతి విజయలక్ష్మి దంపతులు, వారాల రమేష్, కిట్టు, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

నల్లగొండ, చిట్యాల, శాలిగౌరారం, మర్రిగూడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలతోనే బీజేపీ విజయభేరి మోగించిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, పాలకూరి రవి, నూకల వెంకటనారాయణరెడ్డి, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాణసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

● చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, చికిలంమెట్ల అశోక్, పల్లె వెంకన్న, భానుక ఉదయ్, దేవరపల్లి సురేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకొని బాణసంచాలు కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు తోట వినోద్ కుమార్, నాయకులు బోడ రాజు, తుల వెంకటేశ్వర్లు, సయ్యద్, అంజయ్య, లక్ష్మయ్య, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలో బీజేపీ మండల అధ్యక్షుడు రమావత్ రాజేందర్‌నాయక్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబురాలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల శ్రీనివాస్, యాస అమరేందర్‌రెడ్డి, పందుల రాములు, శ్రీనివాసరావు, రమేష్, యాదగిరి, గోపాల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 । కనిష్ఠం 19.0



రిజర్వేషన్ల పైనే అందరిచూపు

» వారంలో కోటా, కేటాయింపులుంటాయనే అంచనా » 15లోగా ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేసే యోచనలో అధికారులు » రిజర్వేషన్ల కోటా ఖరారయితే ప్రక్రియ మొదలయినట్లే

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం ఓ వైపు చకచకా ఏర్పాట్లు చేస్తుంటే మరోవైపు ఆశావహులు రిజర్వేషన్ల ఖరారు కోసం ఎదురుచూస్తున్నారు. వార్డు మొదలు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరీకి కేటాయిస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండకూడదు. దీంతో తాజా కులగణన నివేదిక ప్రకారం బీసీలకు 42శాతం సీట్లిస్తామని, జనరల్ స్థానాల్లో ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతుండడంతో క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో బీసీలు పెద్దసంఖ్యలో విజయం సాధించగా, తాజా పరిస్థితుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కన్పిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

పంచాయతీరాజ్ స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత మండలాలు కలిపి మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 పంచాయతీలు, సుమారు 17,500కు పైగా వార్డులు, 722 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నియామకానికి సన్నాహాలు పూర్తయ్యాయి. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ గుర్తులను సిద్ధం చేశారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. అదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈనెల 15లోగా అన్ని రకాల శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు పూర్తిచేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఈనెల 15తర్వాత ఏ క్షణంలోనైనా ప్రభుత్వం ఆదేశిస్తే షెడ్యూల్ విడుదలవుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈలోగానే రిజర్వేషన్లు కోటా, కేటాయింపులు...

- మిగతా 7వ పేజీలో...

యువతకు రక్తపోటు

» మధ్యవయస్కులను పీడిస్తున్న మధుమేహం
» అసాధారణ స్థాయిలో పెరుగుతున్న రోగాలు
» పల్లెల్లోనూ విస్తరిస్తున్న ఎన్‌సీడీ జబ్బులు

ఆధునిక జీవనశైలి, తగ్గిన శారీరక శ్రమ, జన్యుపరమైన కారణాలతో రక్తపోటు(బీపీ), మధుమేహం (షుగర్) వంటి అసంక్రమిత (ఎన్‌సీడీ) జబ్బులు చుట్టుముట్టుతున్నాయి. ప్రధానంగా 35-40 ఏళ్లకే ఈ రెండింటి లక్షణాలు బయటపడుతున్నాయి. బీపీ, షుగర్ తీవ్రత పెరిగేకొద్దీ శరీరంలోని కీలక అవయవాలైన కిడ్నీ, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరు పతనావస్థకు చేరుతోంది. సైలెంట్ కిల్లర్‌గా చెప్పుకునే క్యాన్సర్‌ను తలపించేలా ఎన్‌సీడీ రోగాలు మనిషి ఆయువును హరించేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ అర్బన్)




ఉమ్మడి జిల్లాలో దశాబ్ద కాలంగా బీపీ, షుగర్ తీవ్రస్థాయిలో విస్తరిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా మూడు పదులు నిండిన యువతలోనూ వీటి లక్షణాలు కనిపిస్తున్న తీరును పరిగణిస్తే ప్రజారోగ్యం భవిష్యత్తు అమాతంలో పడబోతుందన్న ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గత ఏడాది చేపట్టిన ఇంటింటి స్ర్కీనింగ్‌పరీక్షల్లో పల్లెల్లోనూ అసంక్రమిత జబ్బులు (ఎన్‌సీడీ) పెరుగుతున్నట్టు తేల్చింది. విలాస, సుఖవంతమైన జీవనంతో పట్టణవాసులు కొనితెచ్చుకున్న బీపీ, షుగర్ పల్లెలకు విస్తరించడానికి లోపిస్తున్న ఆహార సమతుల్యత, మారుతున్న జీవనశైలి ప్రధానకారణమని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బీపీ పెరుగుతోంది..

యువతలో బ్లడ్‌ప్రెషర్ పెరుగుతోందని, పదేళ్ల కాలంలో బీపీ బారినపడివారి సంఖ్యలో యువత అధికంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. నేటితరం యువత సంప్రదాయ ఇంటి వంటల కంటే రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో లభించే ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ తయారయ్యే ఆహారంలో రుచికోసం మెటానియల్ ఎల్లో, టార్‌ట్రాజన్ అనే రసాయనాలతోపాటు టేస్టింగ్‌సాల్ట్ (చైనా ఉప్పు) తప్పనిసరిగా వాడుతుంటారు. వీటి వినియోగంతో బిర్యానీతోపాటు ఫాస్ట్‌ఫుడ్ ఆహారపదార్థాల్లో మంచి రుచి, రంగు వస్తోంది. ఇలా తయారైన ఆహారాన్ని తరచూ తింటే శరీర బరువు అధికం కావడం, బీపీ పెరిగి జీర్ణ సంబంధిత వ్యాధులు ప్రబలి క్రమంగా శరీరంలో షుగర్ లెవల్స్ పెరుగుతున్నాయి. దీంతోపాటు సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసలైన యువతలో బీపీ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గంటల తరబడి ఒకేచోట కదలకుండా కూర్చొని గేమ్స్‌తో కాలక్షేపం చేస్తూ బీపీ, షుగర్‌వంటి రోగాలకు చేరువవుతున్నారు.

అత్యధికంగా రక్తపోటు బాధితులు

ఆరోగ్య పరిరక్షణకు కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో రక్తపోటు బాధితులు అధికమవుతున్నారు. శాఖాహారం కంటే మాంసాహారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం, నిద్రలేమి, పని ఒత్తిడి, మానసిక ప్రశాంతత లేకపోవడం వెరసి బీపీ పెరుగుతోంది. ప్రధానంగా యువత వ్యసనాలకు అలవాటైన క్రమంలో



వారిలో రక్తపోటు లక్షణాలు కనిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కుటుంబసభ్యులు, స్నేహితులపై సహనం కోల్పోయి ఏకాగ్రతను కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీపీతో బాధపడుతున్నవారి సంఖ్య 2,49,651మంది ఉండగా, వారిలో 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు 1,04,853 మంది (42శాతం) ఉన్నారు. మధుమేహం (షుగర్) బాధితులు 1,42,386 మంది ఉంటే వారిలో 12,815 మంది (9శాతం) యువకులు ఉన్నారు. మిగిలిన 1,29,572 మంది 45 ఏళ్లకు పైబడినవారు, మధ్యవయస్కులు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,86,695 మంది బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడతున్నవారు ఉన్నారు. బీపీ, షుగర్‌వ్యాధుల బారినపడుతున్న వారిలో యువత సంఖ్య ప్రమాదకరస్థాయిలో పెరుగుతుండగా, పట్టణాల్లో నివసించే యువతలో ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రక్తపోటు, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్న...

- మిగతా 7వ పేజీలో...

● వైభవంగా దోపోత్సవం



చెర్వుగట్టు ఆలయ వార్షిక బహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దోపోత్సవం, పూర్ణాహుతిని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

●6లో..

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జూలకంటి రంగారెడ్డి



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు క్షేత్రస్థాయిలో సిద్ధపడాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు చట్టబద్ధత కల్పించేందుకు బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించి ఎస్సీవర్గీకరణ అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రాలపై వివక్షను పదర్శిస్తున్న కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న ఇందిరా పార్కువద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చలో ఇందిరాపార్కు కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లాకమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కన్నుల పండువగా ధ్వజారోహణం



పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజ పటంతో తిరువీధి సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

●6లో..

క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత వృద్ధి

ఎమ్మెల్సీ కోదండరాం



ఎంజీయూలో సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత వృద్ధి జరుగుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. శనివారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆర్థికాభివృద్ధికి ప్రజల ఆర్తి నుంచి కార్యాచరణ తప్పనిసరి అని, యాంత్రీకరణ ప్రణాళికలతో ఉపయోగం ఉండదన్నారు. ప్రాంతీయ అభివృద్ధి రాజకీయ సమీకరణాల ద్వారానే వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ ఫలాలు అణగారిన జాతులకు సమాన పంపిణీ జరగాలన్నారు. సమ్మిళిత వృద్ధి ద్వారా సామాజిక తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగాలని, అందుకు క్రియాశీలక పౌర సమాజం ద్వారనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ పూర్వ ఉపకులపతి జంధ్యాల బాల గంగాధర్ తిలక్, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, వోఎస్డీ కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ ప్రియ, సెస్ డైరెక్టర్ రేవతి, చిట్టేడు కృష్ణారెడ్డి, కేవీ.శశిధర్, పందరయ్య, సైదులు, పాల్గొన్నారు.

నిలిచిన రిజర్వాయర్ పనులు

మర్రిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్ పనులు శనివారం కూడా నిలిచిపోయాయి. నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు అర్హులైన వారికి పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, మూడు రోజులుగా కట్ట నిర్మాణ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారు. మూడు రోజుల నుంచి పనులు అడ్డుకున్న చోటికి ఏ అధికారి రాకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం కల్పించలేదంటూ శుక్రవారం బాధితుడు మాదగోని యాదయ్య పెట్రోల్ మీద పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. అయినా అధికారులు స్పందించడం లేదంటూ బాధితులు మూడో రోజు పనులు అడ్డుకున్నారు. న్యాయం జరిగేంత వరకూ పనులు అడ్డుకుంటామని యాదయ్య, మనోహర, నర్సమ్మ, రాములు, హరికృష్ణ హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు న్యాయం

» దేశంలోనే మొదటగా వర్గీకరణకు కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం
» సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు » టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు విద్యా ఉద్యోగ అవకాశాలల్లో న్యాయం జరుగుతుందని, 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఎట్టకేలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరిగిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను నిలబెట్టుకున్నారన్నారు. వర్గీకరణపై నలుగురు మంత్రులతో కమిటీ, హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్‌తో ఏకసభ్య కమిషన్ వేశారన్నారు. కమిషన్ రిపోర్టు ఇచ్చిన వెంటనే ఈ నెల 4న ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి మాదిగలకు న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణలో మొట్టమొదట ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దామోదర రాజనర్సింహకు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే వర్గీకరణ సాధ్యపడిందన్నారు. న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మొదటినుంచి అండగా ఉండి అమలయ్యే వరకు కృషి చేసిందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలు రుణపడి ఉంటారన్నారు. ఎస్సీల్లో ఏ వర్గానికి అన్యాయం జరగకుండా వారి జనాభా ప్రకారం వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. వర్గీకరణ సాధనకోసం మాదిగలు గత 30 ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేశారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటాలు చేశారన్నారు. వర్గీకరణలో దేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసే విషయంలో కాంగ్రెస్ ముందు వరుసలో ఉన్నట్లు మాదిగలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి జానయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, నాయకులు తోలకొప్పుల గిరి, నకిరేకంటి సైదులు, కొండ భాస్కర్, కొండేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘చేనేత’కు చేయందేనా..?

» గత పాలకుల నిర్లక్ష్యంతో జీవితాలు దుర్భరం
» చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ మూడు సంక్షేమ పథకాలు
» పకడ్బందీగా అమలు చేయాలని చేనేత సంఘాల విజ్ఞప్తి





దేశానికి అన్నం పెట్టే రైతన్న ఎంత ముఖ్యమో, వస్త్రాన్ని అందించే నేతన్న కూడా అంతే ముఖ్యం. మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు దుర్భరంగా మారింది. సనాతన సంప్రదాయాలు కనుమరుగవుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోకున్నా.. వారసత్వ వృత్తిని, కళను కాపాడుకునేందుకు చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. చేనేత కార్మికులకు సంక్రాంతి కానుకగా తెలంగాణ చేనేత అభయ హస్తం పేరుతో మూడు పథకాలను ప్రారంభించింది. ఈ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన చేనేత కార్మికులకు అందించడంలో అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో మెలగాలి. అప్పుడే చేనేత కార్మికులకు లబ్ధి అందుతుంది.

●7లో..

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ

దేవరకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు ఉప్పల రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ హయాంలోనే ఏఎమ్మార్పీ పూర్తయిందన్నారు. టీడీపీ తరుపున పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకు వస్తున్నారని, వారందరికీ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

దరఖాస్తులకే కాంగ్రెస్ పథకాలు పరిమితం

చందంపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన దరఖాస్తుల స్వీకరణతోనే కాలం వెల్లదీస్తుందని బీఆర్ఎస్ మండల నాయకులు జర్పుల లోక్యానాయక్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.కులగణనలో కూడ తప్పుడు లెక్కలతో బీసీలను మోసం చేసిందన్నారు. సమావేశంలో గోసుల శివ, శ్రీశైలం, తిరుపతయ్య, వెంకటేశ్వరరావు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

డిండి ఐటీఐలో జాతీయ అప్రెంటీస్ మేళా

డిండి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈనెల 10వ ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌మేళ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళలో ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ ప్రొఫైల్, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు సమర్పించి ప్రముఖ గుర్తింపు పొందిన కంపెనీలలో అప్రెంటీస్ సౌకర్యాలు పొందవచ్చునని తెలిపారు. ఈమేళలో ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటీస్ యాక్ట్ ప్రకారం స్టైఫండ్ ఉంటుందని చెప్పారు. పరిశ్రమలలో అనుభవాన్ని పెంపొందించుకోవడానికి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి మంచి అవకాశమని తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణులైనవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం సెల్ .9182663839ను సంప్రదించాలన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలి

నిడమనూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 45వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోరే రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మహాసభల కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ ఇంతవరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. సంఘం మహాసభలకు విద్యార్థులు, యువత, మేధావులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శివ, వర్షిత్, అంజి, నాగశివాని, నందిని, శిరీష పాల్గొన్నారు.

'కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు'

నాగార్జునసాగర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్ అన్నారు. సాగర్‌లో శనివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే సాగర్(నందికొండ) అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగర్(నందికొండ) అభివృద్ధికి ఒక్క పైసా నిధులు కూడా ఇవ్వలేదన్నారు. కేసీఆర్ హయాంలోనే వచ్చిన నిధులతోనే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైన కాంగెరస్ నాయకులు బడ్జెట్‌ను తీసుకవచ్చి నందికొండను అభివృద్ధి చేసి చూపాలన్నారు లేని పక్షంలో బీఆర్ఎస్ తరుపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ, నాయకులు జీఎల్ఎం రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రామచంద్రం, రామస్వామి, శ్రీను, వీరయ్య, లక్ష్మన్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నాణ్యమైన విద్య



చింతగూడెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల అధ్యాపకులు

హాలియా, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. చింతగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం వారు సందర్శించి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీరుడు సంజీవరెడ్డి, లింగమూర్తి, ఆదిరెడ్డి, బాలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్



మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల చైతన్య హైస్కూల్‌లో శనివారం ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల వంటలను స్టాళ్లపై ఏర్పాటు చేయగా ప్రిన్సిపాల్ రెడబోతు జయంతీ నర్సి రెడ్డి వాటిని పరిశీలించారు. విద్యార్థులు తీసు కొచ్చిన వంటలను ఉపాధ్యాయులు రుచి చూసి పౌష్టికాహారమైన వంటలను ప్రదర్శి ంచిన విద్యార్థులను అభినందించారు.

వరిలో అంతర్ పంటగా బొబ్బెర

వరిలో అంతర పంటల సాగు పట్ల రైతులు ఉత్సాహం చూపుతున్నారు. పొలం గట్లపై అపరాల సాగుకు యత్నిస్తున్నారు. దీనివల్ల కుటుంబ అవసరాలకు సరిపడా పప్పుధాన్యాల దిగుబడి పొం దుతున్నారు. గతంలో కంది పంటలు వేయగా బెండ, గోకర లాంటి కాయగూరలు కూడ పండించగా ప్రస్తుతం బొబ్బెర్ల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మూడు నాలుగు ఎకరాల్లో అంతర పంటగా బొబ్బెర సాగుచేస్తున్న రైతులు తమ అవసరాలకు పోను కొంత ఇరుగు పొరుగు వారికి విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

వరిలో అంతర పంటగా ఆయకట్టు రైతులు కందిని సాగు చేసేవారు. వానాకాలం వరి నాటు వేసిన మరుసటి రోజు వరాల అంచుల వైపు 20-30 సెంటీమీటర్ల దూరంలో కంది విత్తనాలు నాటేవారు. పొలంలోని నీటి తేమకు కందులు మొలకెత్తి వరికోత సమయానికి పూత పిందె దశకు చేరేవి. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు ఒక్క కారు పంటకు నీరు విడుదల చేసిన రోజుల్లో ఈ కంది పంట రైతులకు అదనపు ఆదాయాన్ని ఇచ్చేవి. వానాకాలం వరికోతలకు వచ్చిన సమయంలో పంట కోతకు రెండు రోజుల ముందు మినుములు చల్లేవారు. కూలీలు వరి కోసి మెదలు ఆరి ఎత్తే నాటికి భూమి పదునుకు మినుములు మొలకెత్తేవి అని రైతులు తెలిపారు. 40-45 రోజులుల్లో మినుములు పండే నాటికి కందులు పండేవని రైతులకు రెండో పంట లేకున్నా కొంత నికరాదాయం వచ్చేదని అంటున్నారు. 2004-05 వరకు ఈ పంటలను రైతులు సాగుచేసి కుటుంబ అవసరాలు తీర్చుకోవడం, ఆదాయం పొందడంతో పాటు నాగటి ఎద్దులు పాడిపశువులకు కంది పొట్టు, మినపపొట్టు దాణాగా వేయడంతో పాడి, పశు వృద్ధి ఉపయోగ పడేదని రైతులు అంటున్నారు.

రెండు కార్లకు కాల్వ నీరు

కాగా సాగర్‌కాల్వకు రెండు పంటలకు నీరు విడుదల చేస్తుండటంతో వానాకాలం పంట


వరిగట్లపై అంతర్ పంటగా సాగుచేస్తున్న బొబ్బెర

పూర్తయ్యే నాటికి కందులు చేతికిరాకపోవడం, వరాలు తీయడానికి కందిచెట్లు అడ్డంకిగా మారడం, దుక్కి దున్నే సమయంలో పొలంలోకి ట్రాక్టర్‌కు రాక పోకలకు అనువుగా లేకపోవడం, కందిచెట్లు కొట్టిన తరువాత కొయ్యాలు వరాల్లో ఉండి గట్లపై నడుస్తున్నప్పుడు కాళ్లకు తగిలి గాయాలు అవుతుండడంతో వరిలో అంతర పంటగా కందుల సాగుకు రైతులు దూరమైనట్లు

● ఎకరాకు 5 నుంచి 6 కిలోల దిగుబడి

తెలుస్తోంది. కంది స్థానం లో వరి పంటకంటే ముందు వచ్చే అంతర్ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

45-50 రోజుల్లోనే పంట

యాసంగి వరినాటి రెడు మూడు రోజులకు కరిగట్టుతో తడిసిన వరాలు ఆరిన వెంటనే అం చుల వెంట 30 నుంచి 40 సెంటీమీటర్ల దూరంలో బొబ్బెర్లు విత్తుకోవాలి. 45-50 రోజుల్లో బొబ్బెర్లు పండుతాయి. వరాల సంఖ్యను బట్టి ఎకరాకు పావు కిలో గింజలు విత్తుకోవచ్చు. పొలానికి స్ప్రే చేసే మందుల వల్ల ఈ మొక్కలకు చీడ సోకే అవకాశం ఉండదు. బొబ్బెర కాసిన తరువాత ఎండిన కాయలు ఎప్పటి కప్పుడు ఏరుతూ వుంటే మొక్కలు కొత్తచిగుళ్ల వేస్తూ వరి పొలం కోసే వరకు కాయలు కాస్తూనే ఉంటాయని రైతుల అంటున్నారు. బొబ్బెర్లను పప్పుగా చేసి పిండి పదార్థాల తయారీలో ఉప యోగించడం, వాటిని ఉడికించి తినడం, విత్తనాలు నాన బెట్టి మొలకలను ఆహారంగా తీసు కోవడానికి ఉపయోగిస్తుంటారు. కిలో రూ.100-120 వరకు విక్రయిస్తుంటారు.

గడ్డి కోసే సమయంలో జాగ్రత్తగా కాపాడాలి

గత యాసంగి నుంచి గట్లపై బొబ్బెర్లు సాగుచేస్తున్నా. రెండు ఎకరాల్లో విత్తనాలు పెడితే 10 కిలోల వరకు దిగుబడి వచ్చింది. వరాలపై గడ్డి కోసే సమయంలో గడ్డితో పాటు బొబ్బెర మొక్కల్ని కోసే అవకాశం ఉంది. గడ్డి కోసే సమయంలో, గడ్డిమందు స్ప్రే సమ యంలో జాగ్రత్తతో మొక్కల్ని కాపాడాలి. వరి కోతకు ముందే పంట పూర్తవుతుంది. -ముత్యాలు, రైతు, త్రిపురారం

అంతర్ పంటలతో ఆదాయం



గతంలో గట్లు పెద్దగా వున్న పొలాల్లో అంతర్‌పంటగా కొబ్బెరి, టేకుచెట్లు పెంచేవారు. వాటి ద్వారా రైతుకు అదనంగా ఆదాయం సమకూరినప్పటికీ వరిపొలంపై నీడలు వ్యాపించడం వల్ల మొక్కలు ఏపుగా ఎదిగా వాలిపోతాయి. ఆకులు పొలంలో పడి దిగుబడికి నష్టం వాటిల్లుతుండడంతో ఆ తరహా సాగును రైతులు వదిలివేశారు. కందుల సాగులోకూడ రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బొబ్బెర్ల సాగు అనుకూలంగా ఉంటుంది. - దేవ్‌సింగ్, ఏడీఏ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● లావూరి వెంకన్న, ఎంఈవో, నిడమనూరు



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు సాయంత్రం స్నాక్స్ కూడా అందిస్తున్నామని ఎంఈవో లావూరి వెంకన్న తెలిపారు. అల్పాహారం కింద ప్రభుత్వం ప్రతిరోజు రూ.15 ఖర్చు చేస్తుందని'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. (నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఎంఈవో: పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 8.15 నుంచి 9.15 వరకు, అలాగే సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. అవగాహనకల్పిస్తూ సన్నద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: అల్పాహారంలోఏమి ఇస్తున్నారు?

ఎంఈవో: పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం కింద పండ్లు, శనగ గుగ్గిళ్లు, బొబ్బర్లు, ఉడకబెట్టిన పల్లీలు, చెన్నమసాల వంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నాం. అల్పాహారం కింద ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ప్రతిరోజు రూ.15 ఖర్చు చేస్తుంది.

ఆంధ్రజ్యోతి: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా?

ఎంఈవో: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని అధికారుల బృందం తరచుగా పరిశీలిస్తుంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాశన

వేములపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండ లంలోని శెట్టిపాలెం, ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అన్నప్రాశన, అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని మాట్లాడుతూ శిశువుకు జన్మనిచ్చిన నాటి నుంచి ఆరు నెలలోపు తల్లిపాలనే పట్టించాలని, ఆ తరు వాత అన్నప్రాశన చేసి అనుబంధ ఆహారాన్ని అంది ంచడం ద్వారా చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటా రన్నారు. అలాగే 5 ఏళ్ల లోపు పిల్లలకు ప్రీస్కూల్ కార్యక్రమం ద్వారా ఆట పాటల ద్వారా పాఠశాలకు సంసిద్ధులను చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీచర్లు విమల, పద్మ, యాదమ్మ, ఏఎన్ఎం కవిత, ఆశాలు కౌసల్య, జయమ్మ, జానకమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.


శెట్టిపాలెంలో చిన్నారులకు అన్నప్రాశన

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


స్వామి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

హాలియా, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): హాలి యా పట్టణంలోని గోవిందమాంబదేవి సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్ర హ్మేంద్ర స్వామి 20వ వార్షికోత్సవ కల్యాణ మహో త్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, గణపతి పూజ, మూల విరాటులకు పారాయణంతో పంచామృత అభిషేకం, విష్ణు సహస్రనామ పారాయణం, కల్యాణమూర్తులకు అభిషేకం, బిందెతీర్థం, ఎదుర్కోళ్లు నిర్వహించారు. అనం తరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురోహితుడు గొట్టిముక్కలనర్సింహాచార్యులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశా రు. సాయంత్రం పురవీధుల్లో కోలాటాలు, డ ప్పు వాయిద్యాల మధ్య స్వామి వారి ఊరే గిం చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్య క్షుడు బ్రహ్మశ్రీ చెన్నోజు మోహనాచారి, కార్పెం టర్ యూనియన్ సంఘం పట్టణాధ్యక్షుడు కాతోజు ఎల్లయ్యచారి, స్వర్ణకారుల సంఘం మండలాధ్యక్షుడు కటకం మురళిచారి, గౌరవా. ధ్యక్షుడు మునగాల పురుషోత్తంచారి, ఓరుగల్లు నారాయణచారి, బొడ్డుపల్లి రాంచందర్, కటకం శంబయ్యచారి, దారోజు శ్రీనివాస్‌చారి, చే పూరి కొండలచారి, నాగార్జున పరిపూర్ణచారి, నారోజు సత్యచారి, మేలోజు సత్యనారా యణచారి పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

త్రిపురారం ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పాల్తీతండా గ్రామంలో దుర్గా ఉపాసకులు శాంతి భారతి పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వరశర్మ ఆచార్యకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే వేదపండితులు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ స్వామి వారి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. అన్నం వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో కోడావత్ ప్రతాప్‌నాయక్, ఎర్రబాబునాయక్, గణేష్‌నాయక్, గోవింద్, శ్రీను, కోక్యానాయక్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పోలీస్‌శాఖ ప్రోత్సాహం

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక ● పలు మండలాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

దేవరకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు పోలీస్‌శాఖ ప్రోత్సాహం అందిస్తుందని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి సబావత్ తండా, ద్వితీయ బహుమతి కొమ్మెపల్లి, తృతీయ బహుమతి కమలాపూర్ గ్రామాలకు చెందిన బృందానికి అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల యువత క్రీడలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్ఐ రమేష్, ఎంఈవో మాతృనాయక్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


దేవరకొండలో విజేతలకు బహుమతుల పంపిణీలో పాల్గొన్న ఏఎస్పీ మౌనిక

● డిండి : మండలకేంద్రంలో మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను ఏఎస్పీ మౌనిక ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ విక్రయించేవారి వివరాలను యువకులు స్వచ్ఛందంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ పోటీల్లో స్పోర్ట్స్‌క్లబ్ చెర్కుపల్లి ప్రథమ బహుమతి జాలి ఫ్రెండ్స్ డిండి ద్వితీయ బహుమతి, గిరిజన యూత్ నగర దుబ్బతండా మూడో బహుమతిని గెలుచుకున్నాయి. కార్యక్రమంలో సీఐ సురేష్, ఎస్ఐ రాజు, ఎంఈవో గోప్యానాయక్ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను నాగార్జునసాగర్ సీఐ బీసన్న, తహసీల్దార్ అనిల్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని తిరుమలగిరి జట్టు, రెండో బహుమతిని చిల్కాపురం, మూడో బహుమతిని కొంపల్లి జట్టు సాధించాయి. కార్యక్ర మంలో స్థానిక ఎస్ఐ వీరశేఖర్, ఎంపీడీవో మల్లేశ్వర్, ఎంఈవో శ్రీనివాస్, కార్యదర్శి శేఖర్, మాజీ సర్పంచులు చవ్వా నాసర్‌రెడ్డి, శాగం శ్రవణ్ కుమార్‌రెడ్డి, ఎట్టల కృష్ణ, ఆవుల నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠ శాలలో కబడ్డీ పోటీల విజేతలకు ఎస్ఐ శేఖర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి : మాజీ ఎమ్మెల్యే

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కంహ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మండలంలోని బాలాజీనగర్ వేం కటేశ్వర స్వామి ఆలయంలో జాతర సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు .అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యెల్గూరి వల్లపురెడ్డి, ఆర్వపల్లి నర్సింహ, రమావత్ దస్రూనాయక్, మాద సుధాకర్ గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, ఎర్ర యాదగిరి, రాయినబోయిన శ్రీనుయాదవ్, రమావత్ దామోదర్ నాయక్, తులసీరామ్ ,కర్నాటి రవి, బస్సీలాల్ పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఢిల్లీలో బీజేపీ గెలుపును హర్షిస్తూ సంబురాలు


దేవరకొండలో బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో హర్షం వ్యక్తం చేస్తూ దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో ఆ పార్టీ నాయకులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. దేవరకొండ, డిండి, కొండమల్లేపల్లి, మాడ్గులపల్లి, చింతపల్లి పెద్దవూరలో భారీర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఢిల్లీ ఓటర్లు బీజేపీకి పట్టం కట్టారని దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటి కృష్ణ అన్నారు. ఢిల్లీలో 27 ఏళ్ల తరువాత బీజేపీ విజయం సాధిం చడం ఆనందంగా ఉందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీలను ఎస్సీ రిజర్వ్ చేయాలి

పెద్దవూర, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పెద్దవూర మండల పరిషత్‌కు ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులను ఎస్సీ రిజర్వ్ వర్గానికి కేటాయించాలని మాజీ ఎంపీటీసీ పులిమాల కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1986 నుంచి పెద్దవూర మండలానికి ఎన్నికలు జరిగినప్పటికీ ఇప్పటివరకు ఎంపీపీ, జడ్పీటీసీ పోస్టుల్లో ఏ ఒక్కటి కూడా ఎస్సీ వర్గానికి రిజర్వ్ కాలేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

చింతపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియాగౌరారం జడ్పీహెచ్‌ఎస్‌లో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్ మండల విద్యాధికారి అంజయ్య పంపిణీ చేశారు కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లం పాండురంగారావు సేవలు అమోఘమన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

చింతపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు నిరసనగా ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ కోరారు. శనివారం మండలంలోని వెంకటేశ్వర నగర్‌లో ధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి రంగాన్ని విస్మరించి నామమాత్రంగా ప్రవేశ పెట్టి చేతులు దుల్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉడుకుంట్ల రాములు, వీటీ నగర్ శాఖ కార్యదర్శి శీష, శ్రీను, మాడగోని గణేష్, గిరి, జలాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం 1999-2000 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చక్రాధర్, ఆంజనేయులు, దుండిగళ్ల అశోక్, యాదయ్య, పూర్వ విద్యార్థులు వేణు, రాంబాబు, అన్వర్, ఖాదర్, లక్ష్మణ్, రసూల్, ప్రవీణ్, కిరణ్, సంధ్య, గీత, లీలావతి, అన్నపూర్ణ, స్వాతి, స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు